# 7

# జ్ఞానము మరియు తెలివికి మూలము, క్రీస్తే

## కొలొస్సయులకు 2:1-7

వారు ప్రోత్సాహింపబడుచు ప్రేమ చేత కలిసికట్టుగా కట్టబడినవారుగాను, దేవుని గూర్చిన సంపూర్ణ తెలివిగలవారునై యుండవలెనని ఆయన కొలొస్సయుల గూర్చి ఆందోళనచెందుచు ఆశించుచున్న సమాచారమును పౌలు 2:1-7లో అందజేయుచున్నాడు. వారికి అవసరమై యుండిన సకల ఆధ్యాత్మిక సమాచారము క్రీస్తునందు దొరుకును, కాబట్టి, వారు ఆయనను వెంబడించుచు ఆయన యెడల విశ్వాసనీయమైనవారుగా నిలిచియుండవలెను.

### పౌలు కోరిక: వారు దేవుని మర్మమును సంపూర్ణముగా గ్రహించవలెను (2:1, 2)

**[1-2]మీ కొరకును, లవొదికయ వారి కొరకును, శరీర రీతిగా నా ముఖము చూడని వారందరి కొరకును నేను ఎంతగా పోరాడుచున్నానో మీరు తెలిసికొనగోరుచున్నాను. వారు ప్రేమయందు అతుకబడి, సంపూర్ణ గ్రహింపుయొక్క సకలైశ్వర్యము కలిగినవారై, దేవుని మర్మమైయున్న క్రీస్తును, స్పష్టముగా తెలిసికొన్నవారై, తమ హృదయములలో ఆదరణ పొందవలెనని వారందరి కొరకు పోరాడుచున్నాను.**

**"నేను ఎంతగా పోరాడుచున్నానో మీరు తెలిసికొనగోరుచున్నాను" (2:1)**

ఈ సమయంలో పౌలు తన ఆలోచనా ధోరణిని యథార్థంగా తెగగొట్టుటలేదను వాస్తవము "వివరణ ద్వారా" అని అర్థమిచ్చు **కొరకు** (*gar*) అను పదము చేత విదితమగుచున్నది. "ప్రతి మనుష్యుని క్రీస్తునందు సంపూర్ణునిగా చేసి యేసు యెదుట నిలువబెట్టవలెననునది" ఆయన లక్ష్యమై యుండినదని ఆయన 1:28లో తెలియజెప్పాడు. కొలొస్సయులు మరియు ఇతరులు కొలొస్సయులకు 2:2లో వ్యక్తముచేయబడిన లక్షణములను వారి జీవితాల్లో అభివృద్ధి చేసికొన్నట్లయితే ఈ కార్యము సాధింపబడినదగును. వారిని క్రీస్తునందు సంపూర్ణులనుగా చేసి యేసు యెదుట నిలువబెట్టవలెననునది తన వంతు లక్ష్యమై యుండుటనుబట్టి, ఆయన వారి పక్షముగాను లవొదికయ మరియు తదితర ప్రదేశములలోని క్రైస్తవుల పక్షముగాను ఆయన గొప్ప పోరాటమును ఎదుర్కొనవలసి వచ్చినది. కొలొస్సయులకు 1:28 మొదలుకొని 2:1 వరకు కలిపిచూచినట్లయితే, ఈ రెండు వాక్యభాగములకు గల సంబంధము స్పష్టముగా తెలియును.

**పోరాటము** (*agōn*)[1] అను పదమునకు, ఉగ్రమైనదియు నిలుకడైనదియునైన ప్రయాసము ద్వారా అభివ్యక్తము చేయబడు అంకితభావము అని అర్థము. 1:29లో "పోరాడుచు" అని అనువదింపబడిన పదము ఇదే మూల పదము నుండి వచ్చినదై యున్నది, అది కొన్ని పర్యాయములు రంగస్థలంలో పోటీపడుచుండువారి చేత వినియోగింపబడు ప్రయాసముతో

సంబంధము కలిగియుండును. పౌలు తన తోటి క్రైస్తవుల ఆధ్యాత్మిక సంక్షేమమును ఎంత శ్రద్ధాళువుతో వెదకుచుండెనో ఇది ఉదాహరణంగా వర్ణించుచున్నది.

**"మీ కొరకును లవొదికయ వారి కొరకును ... నేను ..." (2:1)**

పౌలు గ్రంథస్థంచేసిన పత్రికలలో బలమైన భావోద్రేకములు వ్యక్తము చేయబడినవి.[2] పౌలు ఇతరుల యెడల నిర్దయుడు, అనుభూతిరహితుడు, మరియు ఉదాసీనుడైయున్నవాడై వారి కళ్ల ముందే కదలాడుచు కనబడుచున్నాడని దృష్టించువారు, పౌలు ఎంత జాలిగుండెలుగలవాడో బొత్తిగా అపార్థం చేసికొనుచున్నారు. అదే విధంగా, పౌలును ఎన్నడును ముఖాముఖిగా కలిసికొనని క్రైస్తవులు, ఆయన వారి వ్యక్తిగత మరియు వారి ఆధ్యాత్మిక అవసరముల గూర్చి ఎంత ప్రగాఢంగా అనుభూతిచెందాడో అర్థంచేసికొనియుండకపోవచ్చును. ఆయన వారి ఆధ్యాత్మిక సంక్షేమము గూర్చి కలిగియున్న ఆసక్తి యొక్క తీవ్రతను వారి యెదుట ప్రదర్శించగలుగునట్లు తన మనస్సులోని ఈ పార్శ్వమును బట్టబయలు చేయుచున్నాడు.

ఇంతకూ, ఆయనకు అప్పగింపబడిన పని పట్ల పౌలు వైఖరి ఏమైయుండినది? ఆయన చేరగలిగిన ప్రతి ఒక్కరిని (రోమీయులకు 1:14, 15) – ఆయన ముఖాముఖిగా కలిసికొనలేకపోయినను తన పత్రికల ద్వారా ఆదరింపగలిగినవారిని సహితము – సువార్తతో చేరుటయే ఆయన ప్రేషితోద్యమమై యుండినది. "సువార్తను ప్రకటింపవలసిన భారము నా మీద మోపబడి యున్నది; అయ్యో, నేను సువార్తను ప్రకటింపక పోయినయెడల నాకు శ్రమ" అని ఆయన రచించాడు (1 కొరింథీయులకు 9:16).

పౌలు **లవొదికయలోని**[3] సంఘము గూర్చి ఆందోళన చెందుచుండెను, లవొదికయ కొలొస్సీపట్టణమునకు పశ్చిమ దిశగా పన్నెండు మైళ్ల దూరంలో ఉండినది. అనేక సంవత్సరముల తదుపరి, ఈ సంఘము నులివెచ్చనగా నున్న సంఘమనియు, ఐహిక సిరిసంపదలతో తులతూగుచుండినది కానీ ఆధ్యాత్మికముగా ఆధ్వాన్న స్థితిలో నున్నదని వర్ణింపబడినది (ప్రకటన 3:14–22). అలంకారికంగా చెప్పుకొంటే, వారి పరిస్థితి, యేసు వారిని తన నోట నుండి ఉమ్మివేయ నుద్దేశించుచుండినటువంటిదై యుండెను.

**"శరీర రీతిగా నా ముఖము చూడనివారందరి కొరకును" (2:1)**

అలాగని, ఆయనను కొలొస్సీ పట్టణములోని క్రైస్తవులెవరును ఆయనను చూడలేదని పౌలు భావించలేదు. ఇలా మాటలాడుచుండినప్పుడు ఆయన మూడు గుంపులకు చెందినవారిని సంబోధించుచుండెను. ఆయన ఎంతగనో పోరాడుచుండినది, "మీ కొరకును" అనగా, కొలొస్సీ పట్టణములోని క్రైస్తవులు; "లవొదికయ వారి కొరకును" అనగా, లవొదికయ పట్టణములో నున్నవారు; "శరీర రీతిగా నా [తన] ముఖము చూడనివారందరి కొరకును" అనుభావమును ఆయన తెలియజెప్పాడు. మొదటి రెండు గుంపులకు చెందినవారిలో కొందరు మరియు పౌలును ముఖాముఖిగా కలిసికొనని ఇతరులు కూడ మూడవ గుంపులో చేరియుండవచ్చును. ఇదే నిజమైనట్లయితే, ఆయనను అనేకులు చూడకపోయినప్పటికిని, లైకస్ లోయ (లవొదికయ, హియెరాపొలి మరియు కొలొస్సీ పట్టణములు వెలసిన లోయ – కొలొస్సయులకు 4:13) లోని ప్రజలలో కొందరు ఆయనను చూచియుండవచ్చును.

**వ్యక్తిగతముగా** (శరీర రీతిగా) అను పదము గ్రీకు పదజాలము *mou en sarki*

(అక్షరాలా, “నా శరీరముతో కూడ”) నుండి అనువదింపబడనది, అనగా “శరీర రీతిగా” ఆయన **ముఖమును చూడనివారు**. కేవలము ఆయన బోధలు వినినవారికిని, వాస్తవముగా ఆయనను కలిసికొనినవారికిని మధ్య నున్న తారతమ్యమును పౌలు తెలియజేయుచుండెను.

**“తమ హృదయములలో ఆదరణ పొందవలెనని” (2:2)**

పౌలు పడుచుండిన తీవ్రమైన ప్రయాసము ఇతరులను ఆధ్యాత్మికముగా ఉన్నత స్థితిలోనికి తీసికొనివెళ్లు దిశగా నిర్దేశింపబడినది. ఆయన అందోళనంతా వారి శారీరక సంక్షేమము కంటే ఎక్కువగా వారి హృదయముల పరిస్థితి గూర్చినదై యుండెను. బైబిలులో **హృదయములు** (*kardiai*) అను పదము, ఒకని అంతరంగ జీవితములోని ప్రధాన కేంద్రము గూర్చి చెప్పుకొనబడిన సందర్భములో వాడబడినది. బైబిలులో ఒక్క చోట మాత్రమే ఈ పదము శరీరములో రక్తప్రసరణను గావించుచుండు భౌతికమైన గుండెను సూచిస్తూ వాడబడినది (2 సమూయేలు 18:14; LXX). ఒకని అంతరంగములోని భాగమును సూచించుటతో పాటుగా, అది ఒక భౌతిక కేంద్రము, ఉదా॥ “భూగర్భము” (మత్తయి 12:40) అను అర్థమును కూడ ఇచ్చును.

క్రొత్త నిబంధనలో మానవ “హృదయము” అని ప్రస్తావింపబడినప్పుడు, ఒకడు ఆలోచనచేయుటకు (మత్తయి 9:4), గ్రహించుటకు (మాత్తయి 13:15), తర్కించుటకు (మార్కు 2:6), అనుమానించుటకు (మార్కు 11:23), ఊహించుటకు (లూకా 1:51), మననము చేయుటకు (లూకా 2:19), ఆశ్చర్యపడుటకు (లూకా 3:15), మోహించుటకు (రోమీయులకు 1:24), విశ్వసించుటకు (రోమీయులకు 10:10), మోసపోవుటకు (రోమీయులకు 16:18), మరియు ఖండించుటకు (1 యోహాను 3:21) ఉపయోగించు బుద్ధిబలము, మానసిక, మరియు ఆధ్యాత్మిక ప్రధాన కేంద్రము విషయములో *kardia* వాడబడినది. ఇందులో ఈ క్రింది భావోద్రేకములను సూచించునది, ఒకని అంతరంగ భాగము, కూడ చేరియుండవచ్చును: ప్రేమించునది (మత్తయి 22:37), విచారపడునది (మార్కు 3:5), కలవరపడునది (యోహాను 14:1), దుఃఖించునది (యోహాను 16:6), ఆనందించునది (అపొస్తలుల కార్యములు 2:26), వేదననొందునది (2 కొరింథీయులకు 2:4), మరియు ప్రోత్సాహింపబడునది (కొలొస్సయులకు 4:8). దానిలో చిత్తము/అభీష్టము, ఒకని ఉద్దేశములో గల ప్రధాన కేంద్రము (అపొస్తలుల కార్యములు 11:23), మరియు తాత్పర్యము (హెబ్రీయులకు 4:12) కూడ కలిసియుండును.

కొలొస్సీ పట్టణ క్రైస్తవుల ఆధ్యాత్మిక జీవితములకు కేంద్రమైయున్న దానిని, వారి హృదయములను, బలముగా బలపరచవలెనని పౌలు ఆశించాడు, ఆతురపడ్డాడు. శారీరక లక్షణములు ముఖ్యమైనవే. కానీ అంతరంగ పురుషుడు, “హృదయములో దాగియున్న అంతరంగ స్వభావము” (1 పేతురు 3:4) ముఖ్యమైనదై యున్నంత కాదు. దేవుడు బాహ్యరూపమునకు బదులుగా హృదయమును లక్ష్యపెట్టును.[4] సొలొమోను మందలింపు ముఖ్యమైనదై యున్నది: “నీ హృదయములో నుండి జీవధారలు బయలుదేరును, కాబట్టి అన్నిటి కంటె ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము” (సామెతలు 4:23). మానవుడు రొట్టె వలన, భౌతిక జీవితమునకు అవసరమైయున్న ప్రధాన పంట వలన మాత్రము జీవించడు, కానీ దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాట, హృదయమునకు అవసరమైయున్న

ఆధ్యాత్మికాహారము వలన జీవించును (మత్తయి 4:4).

### "ప్రేమ యందు అతుకబడి" (2:2)

**అతుకబడి** అని అనువదింపబడిన పదము యొక్క మూలము (*sumbibazō*) లో "ఒక్కచోటికి తీసికొనివచ్చుట" యను భావము కలిసియున్నది, ఉదా॥ ఏదైన ఒక విషయమును (సత్యమును) ఋజువుపర్చుటకు చేయబడు ఆలోచనల కొరకు (అపొస్తలుల కార్యములు 9:22), ఒక తుది అభిప్రాయము నిమిత్తము (అపొస్తలుల కార్యములు 16:10), ఒక పాఠమును నేర్పించుట కొరకు (1 కొరింథీయులకు 2:16), లేక అందరిని ఐక్యపర్చుటకు (ఎఫెసీయులకు 4:16; కొలొస్సయులకు 2:2, 19) చేయబడు ప్రయత్నముల సందర్భాల్లో ఈ భావము వ్యక్తమగుచున్నది. పౌలు *agapē* అను పదమును కొలొస్సీ పత్రికలో పేర్కొనిన ఐదింటిలో ఇది నాలుగవసారి (1:4, 8, 13 ["ప్రియమైనవారు"]; 3:14 చూడుము).

యోనాతాను తన స్నేహితుడైన దావీదు యెడల కలిగి యుండిన ప్రేమ, ప్రేమయందు అతుకబడి యుండుటకు ఒక చక్కని ఉదాహరణయై యున్నది (1 సమూయేలు 18:1). క్రైస్తవులు ఒకరి యెడల మరొకరు యోనాతాను మరియు దావీదు పంచుకొనుచుండిన ఇటువంటి సన్నిహితమునే, ఇటువంటి చింతనే కలిగియుండవలెను. ఐక్యత చిరకాలము నిలిచియుండు ప్రేమ మరియు సహించుచుండు నమ్మకముపై ఆధారపడును.

మంద ఒక్కటియు, గొఱ్ఱెల కాపరి ఒక్కడును అగునని యేసు ఉపదేశించాడు (యోహాను 10:16). ఆయన సమస్త విశ్వాసుల సమైక్యత నిమిత్తము ప్రార్థించాడు (యోహాను 17:20, 21). క్రైస్తవులు విభజింపబడినవారై యుండకూడదు (1 కొరింథీయులకు 1:10), కానీ వినయము, సాధుత్వము, సహనము, అనురాగము, మరియు ఒకరి యెడల మరొకరు దీర్ఘశాంతము గలవారై యుండుట ద్వారా ఐక్యతను కాపాడుకొనవలెనని పౌలు మందలించాడు (ఎఫెసీయులకు 4:1–3). "శరీరమొక్కటే, **ఆత్మయు** ఒక్కడే, ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి; ప్రభువు ఒక్కడే, విశ్వాస మొక్కటే, బాప్తిస్మ మొక్కటే, అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికి పైగా ఉన్నవాడై అందరిలోను వ్యాపించి, అందరిలో ఉన్నాడు" అను వాస్తవము ఆధారంగా దేవుడు ఐక్యతను సాధ్యం చేసాడు (ఎఫెసీయులకు 4:4–6). ఐక్యత, క్రీస్తును అనుకరించుట ద్వారా కలుగును కానీ మనుష్యుల సాంప్రదాయములు మరియు లోక సంబంధమైన మూలపాఠముల వలన కలుగదు (కొలొస్సయుకు 2:8). వారు క్రీస్తునకు కలిగిన సంపూర్ణతకు సమానమైన సంపూర్ణతకలవారగుకొలది ఆయన విశ్వాసులందరిని ఐక్యపర్చుచుండును (ఎఫెసీయులకు 4:13).

విశ్వసనీయమైన విశ్వాసులందరి ఐక్యత, ప్రతి క్రైస్తవుని లక్ష్యమై యుండవలెను. మనము లోకసంబంధులైనవారితో గాని, క్రీస్తు వలన కలుగని అభ్యాసములు, వైఖరులు, మరియు నీతిలో నిమగ్నమైయున్నవారితో గాని ఐక్యతగలవారమై యుండకూడదు, దాని గూర్చి ఆలోచించనూ కూడదు (రోమీయులకు 16:17; 2 కొరింథీయులకు 6:14–17).

### "సంపూర్ణ గ్రహింపు యొక్క సకలైశ్వర్యము కలిగినవారై" (2:2)

పౌలు ప్రకారము, నిజమైన **ఐశ్వర్యము,** డబ్బులో లేదా భౌతికముగా అర్థమైన వస్తువులలో

లభ్యము కాదు. "ఐశ్వర్యము" (*ploutos*), 1:27లో కూడ పేర్కొనబడి యున్నది, **గ్రహింపులో** (*sunesis*) దొరకును. దేవుడు కొలొస్సయులకు గ్రహింపును అనుగ్రహించవలెననియు వారు దేవుని విషయమైన జ్ఞానమందు అభివృద్ధిపొందవలెననియు పౌలు వారి కొరకు ప్రార్థించాడు (1:9, 10). ప్రాపంచిక ఐశ్వర్యమునకు బదులుగా, క్రైస్తవులు పరలోక సంబంధమైన సిరిసంపదలను, ఆధ్యాత్మిక ధనమును, మరియు నిత్యమైన దీవెనలను వెదకవలసి యున్నది (మత్తయి 6:20; 1 తిమోతి 6:19).

అజ్ఞానము అభద్రతను పుట్టించును, గ్రహింపు (ఆత్మ) విశ్వాసమును కలుగజేయును. దేవుడు బయలుపరచిన వాక్యము దేవుని ప్రణాళికలు మరియు ఆయన సంకల్పముల గూర్చిన పరిజ్ఞానములను మనకు సమకూర్చుచున్నది. ఆయన వాక్యమును గూర్చిన జ్ఞానము, క్రైస్తవ జీవితమునకు సంబంధించిన "ప్రస్తుత మరియు రాబోవు జీవితము కొరకైన వాగ్దానము కలిగియున్నదను" అభయము నిచ్చును (1 తిమోతి 4:8). యేసు క్రీస్తునందలి విశ్వాసము ఎంతో విలువైనదను ఆభయమును మనము నిస్సందేహముగా కలిగియుండవచ్చును. యేసు ఉపదేశములలో లభ్యమగు సిరిసంపదలు ప్రేమ ద్వారా మనలను ఐక్యపరచి అతుకజేయును మరియు మనము దేవుని మనస్సును గ్రహించుటకు సహాయకరముగా నుండును.

ఇంతేగాక, "అజ్ఞాన అంధకారములో" నున్నవారు రక్షింపబడని స్థితిలోనే నిలిచియుందురు (రోమీయులకు 10:1–3). వారు దేవుని వలన కలుగు జీవములో నుండి మినహాయింపబడినవారై యున్నారు (ఎఫెసీయులకు 4:17, 18). ఒకడు దేవునితో కలిగియుండు సంబంధమునకు, గ్రహింపు, ఒక అత్యావశ్యకమైన అంశమై యున్నది.

### "దేవుని మర్మమైయున్న క్రీస్తును, స్పష్టముగా తెలిసికొన్నవారై" (2:2)

క్రైస్తవులకు ఒక మోస్తరు గ్రహింపు అగత్యమై యున్నది. మర్మమును గూర్చిన **స్పష్టమైన తెలివి** – యేసు మరియు ఆయన అనుగ్రహించు రక్షణ – దేవుని ప్రత్యక్షత గూర్చిన గ్రహింపునకు ఫలితమై యున్నది. **దేవుని మర్మము, అనగా క్రీస్తు తానే,** అను పదజాలమునకు గ్రీకు వాక్యభాగములో విభిన్నమైన భావములున్నవి గనుక అవి వెవ్వేరు విధములలో తెలియజేయబడవచ్చును:

> గ్రీకు వాక్యభాగమును నాలుగు వెవ్వేరు రీతులలో అర్థంచేసికొనవచ్చును: (1) "దేవుని మర్మము, అనగా, క్రీస్తు యొక్క మర్మము," దీనిలో "క్రీస్తు," "దేవునికి" పొందికయైన అన్వయమై యున్నాడు, (2) "క్రీస్తు యొక్క దైవుడైయున్నవాని మర్మము," కానీ "క్రీస్తు"కు ముందు నిర్ధారణకరమైన అసమాపక క్రియాపదము లేకపోవుట వలన ఈ భావము సత్యదూరమైనదై యుండగలదు, (3) "దేవుడైయున్న క్రీస్తు (లేక, 'దైవికమైన క్రీస్తు') మర్మము," దీనికి సమాంతరమైనది క్రొత్త నిబంధనలో లేదు, మరియు (4) "దేవుని మర్మము, ఆ మర్మమే క్రీస్తు అయియున్నాడు," దీనిలో "క్రీస్తు," "దేవుని మర్మము" అను పదజాలమంతటికిని పొందికయైన అన్వయమై యున్నాడు. అసంఖ్యాకమైన ఆధునిక వ్యాఖ్యానకర్తలు మరియు అనువాదకుల చేత ఈ చివరి భావము అంగీకరింపబడుచున్నది.[5]

హెచ్. సి. జి. మౌల్ మరియు ఇతరులనేకులు ఈ తుది అభిప్రాయముతో ఏకీభవించుచున్నారు. నానా విధములైన బాధ్యతల గూర్చి చర్చించిన పిదప, మౌల్ ఇలా చెప్పుచున్నాడు, " 'దేవుని మర్మము, అనగా క్రీస్తే' అని మేము అనువదించుచున్నాము."[6]

యేసు, ఆయన జీవితము మరియు ఉపదేశముల ద్వారా కనిపించుచున్న విధంగా, పూర్వ తరముల యందంతటను దాచబడి మర్మము యొక్క ప్రత్యక్షతయై యున్నాడు. పాత నిబంధనలోని ప్రవచనాత్మకమైన పలుకులు ఆయన రాకడ మరియు ఆయన చేయు పనుల స్వభావము గూర్చిన సూచనలిచ్చినవి, కానీ మర్మముపై కప్పబడియుండిన ముసుగు ఆయన ఈ లోకమునకు వచ్చునంత వరకు అలాగే నిలిచియుండినది. ఆయన ఈ లోకమునకు అరుదెంచుటనుబట్టి, దేవుని స్పష్టమైన తెలివి ఇప్పుడు యేసు నందు అందరికి అందుబాటులో నున్నది: "... దేవుడే తన మహిమను గూర్చిన జ్ఞానము యేసు క్రీస్తు నందు వెల్లడిపరచుటకు మా హృదయములలో ప్రకాశించెను" (2 కొరింథీయులకు 4:6).

"మర్మము" (*mustērion*) అను పదము ఈ పత్రికలో నాలుగు పర్యాయములు పేర్కొనబడి యున్నది (1:26, 27; 2:2; 4:3). ఆంగ్ల పదము ఆధారంగా చూచినట్లయితే దీని అర్థం మారిపోతుంది, అది సాధారణంగా వివరించలేనంత లేక గ్రహించలేనంత, "గూఢమైన" మరియు "గాబరాపెట్టు" అను భావమును కలుగజేయుచున్నది. మానవ హేతువాదము మరియు ప్రయాసము ద్వారా కాదు, కానీ దైవికమైన ప్రత్యక్షత ద్వారా మాత్రమే గ్రహింపబడగల దైవికమైన ఒక రహస్యము సందర్భములో పౌలు ఈ పదమును ప్రయోగించాడు.

గ్రీకు మరియు రోమా సంస్కృతులలో, "మర్మము" అను పదము నానా విధములైన నిగూఢత్వ మతముల గూర్చి మాటలాడుకొనిన సందర్భములో అన్వయింపబడినది. వారి కర్మకాండలు, వారి దేవుళ్లు మరియు దేవతలకు సంబంధించిన కథలపై ఆధారపడినవై, శ్రమానుభవములను చిత్రీకరించు ఉద్రేకపూర్వకమైన నాటకముల వంటివై యుండినవి. ఈ విభిన్న పూజలు తికమకపెట్టు చిహ్నములు కలిగియుండినవి గనుక వారి మతములో సభ్యులైయుండ గోరినవారికి అవి అతి జాగ్రత్తగా నేర్పింపబడినవి. కొన్ని సందర్భములలో సభ్యత్వమును పొందుకొనుటకైన ప్రారంభ ప్రవేశమునకు, ఈ దేవతల శ్రమలు, మరణము, పునరుత్థానము కల్ట్ సభ్యుల చేత అభినయింపబడుచుండగా, సభ్యత్వములో ప్రవేశింపగోరువారు దీనంతటిని శ్రద్ధతో గమనించుట ద్వారా వారు కూడ ఆ శ్రమలలో పాలుపంచుకొనవలసినవారై యుండిరి. సభ్యులుకానివారికి, ఇదంతా అర్థరహితమైన అంశమై యుండినది; కానీ, ప్రారంభికునికి, ఈ అనుభవం, వానిలో ఒక చెరగని ముద్రవేయుచుండినదై, వాని మనస్సును పూర్తిగా మార్చివేయు స్వభావము గలదై యుండినది.

ప్రవచింపబడిన దేవుని రాజ్యము విషయమై బయలుపరచబడని స్వభావము గూర్చి ప్రస్తావించిన సందర్భములో యేసు *mustērion* ఉపయోగించాడు (మత్తయి 13:11). యేసు క్రీస్తు ద్వారా నెరవేర్చవలెనని దేవుడు సంకల్పించిన ప్రణాళిక ప్రకారమైన పనులు గతించిన యుగములలో రహస్యముగా దాచబడి యుంచబడినవి కానీ పరిశుద్ధాత్మ ద్వారా అపొస్తలులకును ప్రవక్తలకును బయలుపరచబడినవి (రోమీయులకు 16:25; ఎఫెసీయులకు 3:4, 5). ఇతరులతో పాటు, పౌలు కూడ ఈ ప్రత్యక్షతను పొందియున్నాడు (1 కొరింథీయులకు 4:1; ఎఫెసీయులకు 1:9; 3:3).

## ఆయన బయల్పాటు: బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు క్రీస్తునందే గుప్తములై యున్నవి (2:3, 4)

**[3]బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు ఆయనయందే గుప్తములై యున్నవి. [4]ఎవడైనను చక్కని మాటలచేత మిమ్మును మోసపరచకుండునట్లు ఈ సంగతిని చెప్పుచున్నాను.**

### "బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు ఆయనయందే గుప్తములై యున్నవి" (2:3)

"అపొక్రిఫ" (*apokruphoi*) అప్రమాణిక గ్రంథము మరియు "అపొక్రిఫ "apocrypha" సంబంధితమైన" "apocryphal" మరియు (అప్రమాణిక గ్రంథముల సంబంధమైన) అను ఆంగ్ల పదములకు **గుప్తములై యున్నవి** (*apokruphoi*) మూలాధారమై యున్నది. పౌలు **సంపదలు** మరియు **జ్ఞానము** గూర్చి వ్రాయుచుండెను. ప్రాచీన ప్రపంచంలో, బ్యాంకులు లేని రోజుల్లో, అతి గొప్ప విలువైన సంపదలు అవి అవసరమయ్యేంత వరకు తరుచుగా సురక్షితమైన స్థలములలో దాచబడుచుండినవి. దేవుడనుగ్రహించు ఆధ్యాత్మిక ఐశ్వర్యమును కనుగొనునట్లు, వాటిని వెదకువారు దేవుని సంపదలు దాచబడియున్న స్థలములో: యేసు క్రీస్తులో, వెదకుచుండవలెను.

దేవుని ధననిధిలో దాచబడియున్న యేసు ఉపదేశములన్నిటిని కొలొస్సయులు అవగాహన చేసికొనగలరని పౌలు భావించలేదు. **బుద్ధి** (*gnōsis*) మరియు "జ్ఞానము" యొక్క సర్వసంపదలు యేసు క్రీస్తునందే గుప్తములై యున్నవనియు, అవి మరెచ్చోటనైనను లభ్యముకావనియు వారు గ్రహించవలెనని ఆయన ఆశించాడు. ఈ హేతువునుబట్టియే, కొలొస్సయులు మరెచ్చోటయైనను వెదకనివారై యుండవలెను: క్రొత్త నిబంధన అపొస్తలులు మరియు ప్రవక్తలు ప్రబోధించిన ఉపదేశములను తప్ప, క్రీస్తుకు పూర్వమున్న బోధలనుగాని లేదా అటుతరువాత అల్లబడిన కథలనుగాని వారు అంటిపెట్టుకొని యుండకూడదు. క్రైస్తవ విశ్వాసికి అవసరమైన సమస్తము, క్రీస్తే.

### "ఎవడైనను చక్కని మాటలచేత మిమ్మును మోసపరచకుండునట్లు ఈ సంగతిని చెప్పుచున్నాను" (2:4)

వారు బుద్ధి జ్ఞానముల కొరకు మరెక్కడైనను వెదకవలసిన అవసరంలేదని పౌలు కొలొస్సీ పట్టణములోని తోటి సహోదరులకు అభయమిచ్చుచుండెను. అవి ఆకర్షణీయమైనవే, కానీ అర్థరహితమైనవైనందు వలన అట్టి అభిప్రాయములను అనుకరించుటకు యేసు క్రీస్తు చేత స్థిరపరచబడిన సత్యమును విడిచిపెట్టకూడదని కూడ ఆయన వారిని హెచ్చరించుచుండెను. క్రైస్తవులైనవారు అబద్ధ బోధకులు, మనస్సును ప్రభావితముచేయు ప్రసంగీకులు, మరియు ఆవేశపూరితంగా ఉంటూ వారినాకర్షించు కార్యక్రమముల చేత ఒప్పింపబడు అపాయము ఎల్లప్పుడు వారికి ఎదురుగానే నిలిచియుంటుంది. **ఎవడైనను** అని చెప్పుట ద్వారా, పౌలు మనస్సులో[6] ఏ ఒక్క నిర్దిష్టమై వ్యక్తి లేడు. విస్తృతమైన ఈ ప్రకటన యేసు ప్రవేశపెట్టిన ప్రబోధములకు విరుద్ధమైన బోధలు చేయువారందరికిని వర్తించును. వేరొక సువార్తను బోధించువారు ఎవరైనను, అది "మేము" – అపొస్తలులు, వారిలో ఆయన కూడ కలుపబడియున్నాడు – పరలోకమందలి దూతయైనను – వారు శాపగ్రస్తులౌదురని పౌలు

ఘోషించాడు (గలతీయులకు 1:7, 8).

తప్పుడు బోధలు చేయుచుండువారు వారి బోధలను "ఈ బోధలు బలే బాగున్నాయే" అని అనుకొనునట్లు చేయు ప్రసంగములపై ఆధారం చేసికొన్నట్లయితే, వారు ప్రబలమై యుండవచ్చును. క్రైస్తవులు వారి విశ్వాసము నిమిత్తము బండవలె గట్టిదియు స్థిరమైనదై యున్న పునాదిపై ఆధారపడవలెను, ఏలయనగా నిర్మించుకొనుటకు గట్టిదియు, స్థిరమైనదైన పునాది గూర్చిన సత్యమును యేసు క్రీస్తు బయలుపర్చాడు (మత్తయి 7:24-27). వినవలెనని వారు కోరుకొను ప్రకారమే ఆకర్షణీయంగా వినిపించు, కనిపించు అభ్యాసములు మరియు వాదోపవాదములు (2 తిమోతి 4:3, 4) శ్రోతలను వంచించి తప్పుదోవను పట్టించును. క్రైస్తవులు చెరగని ముద్రవేయు ప్రసంగీకులు మరియు ఆసక్తికరమైన నివేదికలు తెలియజేయు అసలు విషయాలకు అవల చూచుచుండవలెను. ఆయన యేసుక్రీస్తును, అనగా సిలువవేయబడిన యేసు క్రీస్తునే ప్రకటించాడనియు, ఆయన సందేశములను వినుచుండినవారిని ఒప్పించుటకుగాను ఆయన మానవ జ్ఞానమును ఉపయోగించుకొనలేదనియు పౌలు కొరింథీయులకు వ్రాసాడు (1 కొరింథీయులకు 2:1, 2; 1 థెస్సలొనీకయులకు 2:5 చూడుము).

పరిశుద్ధాత్మ చేత ఆయనకు బయలుపరచబడిన విషయములనే బోధించుచు వాటిని సమర్థవంతంగా కాపాడుకొనుట ద్వారా, పౌలు తన పరిచర్యను సఫలీకృతముగా నెరవేర్చుచుండెను. ఈ పని చేయుటకు పౌలు యోగ్యుడని యేసు పౌలును ఏర్పరచుకొని ఆయనను ఒక అపొస్తలునిగా నియమించి ఆయనకు సువార్తను బయలుపరచుచుండెను (గలతీయులకు 1:11, 12). సంఘ సంక్షేమాభివృద్ధి గూర్చి ఆయనకుండిన బాధ్యతను పౌలు గ్రహించాడు (కొలొస్సయులకు 1:25), దానిని ఇప్పుడు కొలొస్సయులు మరియు ఆయన ఉత్తరమును చదువనైయుండిన ఇతరుల ప్రయోజనార్థమై నెరవేర్చుచుండెను.

కొలొస్సయులకు 2:3-10 వరకు గల ప్రకటనలు మిగిలిన ఉత్తరములో పౌలు తెలియజేయునై యుండిన సందర్భములకు పునాదిగా నుండినవి. క్రైస్తవులకు కావలసినదంతా యేసు, మరియు ఆయన బోధలు మనకు ఆకర్షణీయముగా నుండునవే ఆయినను యేసు, సత్య బోధకుడైన యేసుపై ఆధారపడని నానా విధములైన సిద్ధాంతముల చేత మనము నిత్య సత్య పథములో నుండి తొలగిపోయిన మత భ్రష్టులము కాకూడదు.

## ఆయన ఆనందము: యేసుక్రీస్తునందలి వారి విశ్వాసము (2:5)

**5 నేను శరీర విషయములో దూరముగా ఉన్నను, ఆత్మవిషయములో మీతో కూడ ఉండి, మీ యోగ్యమైన ప్రవర్తనను క్రీస్తునందలి మీ స్థిరవిశ్వాసమును చూచి ఆనందించుచున్నాను.**

### "నేను శరీరవిషయములో దూరముగా ఉన్నను ఆత్మవిషయములో మీతోకూడ ఉండి," (2:5)

**నేను శరీర విషయములో దూరముగా ఉన్నను,** అని పలుకుచు పౌలు **ఆత్మవిషయములో మీతో కూడ ఉన్నాను** అంటూ ముందుకు సాగుచున్నాడు. పౌలు చేసిన ఈ ప్రకటనలో గల ఆయన భావమేమై యున్నది?

ఒక తండ్రి తన గృహమును విడిచిపెట్టి వెళ్లుచున్న కుమారునితో కూడ ఉన్నాడను భావంలో ఆయన కొలొస్సయులతో కూడా ఉండినాడా? తండ్రి, "నా కుమారుడా, నేను నీతో కూడ శారీరకంగా ఉండను, కానీ ఆత్మ రూపినై ఉంటాను" అని కుమారునికి చెప్పవచ్చును. ఇదే విధమైన ప్రకటనను పౌలు మరొక చోట కూడ చేసాడు: "సహోదరులారా, మేము కొద్దికాలము మిమ్మును ఎడబాసియున్నను, మనస్సునుబట్టి మీ దగ్గర ఉండి, మిగుల అపేక్షతో మీ ముఖము చూడవలెనని మరి యెక్కువగా ప్రయత్నము చేసితిమి" (1 థెస్సలొనీకయులకు 2:17). సహోదరుల గూర్చి ఆయన దైవికమైన అంతర్దృష్టి కలిగియుండెనని అర్థమిచ్చుచున్నట్లు ఈ పదములు అగుపించుటలేదు, కానీ ఆయన వారి యెడల కలిగియుండిన అనురాగసహితమైన తన వైఖరినిబట్టి వారితో కూడా ఉండెనని అవి సూచించుచున్నవి.

ఆయన వారితో కూడ ఆత్మవిషయములో ఉన్నాడని ఎపఫ్రా నివేదికనుబట్టి (1:7, 8) మనకు తెలియుచున్నదా? క్లోయె యింటివారందించిన ఒక నివేదిక (1 కొరింథీయులకు 1:11), వారు వ్రాసిన ఉత్తరము (1 కొరింథీయులకు 7:1) మరియు బహుశా ఇతర వనరుల ద్వారా (1 కొరింథీయులకు 4:18; 5:1; 11:18; 15:12; 2 కొరింథీయులకు 7:7; 10:10) పౌలు కొరింథీయులకు సంబంధించిన సమాచారమును పొందియున్నాడు. ఇతర సంఘములకు సంబంధించిన సమాచారమును కూడా ఆయన నానావిధమైన ఇతర వనరుల ద్వారా తెలిసికొన్నాడు (రోమీయులకు 1:8; 1 థెస్సలొనీకయులకు 1:8; 3:6). ఇటువంటి నివేదికలు ఆయన వారితో కూడా ఆత్మీయ విషయములో ఉన్నాడని చెప్పగలుగునట్లు సంఘ సభ్యులందరికిని సన్నిహితముగా ఉన్నటువంటి అనుభూతిని ఆయనకు కలిగించుచుండినవా?

కొలొస్సయుల జీవితములోని సూటియైన అంతర్దృష్టిని దేవుడు అపొస్తలునికి అనుగ్రహించాడా? పౌలు పూర్వోక్తమైన రెండు సాధ్యతలను తన మనస్సులో ఉంచుకొని యుండినట్లయితే, "మీ యోగ్యమైన ప్రవర్తనను క్రీస్తునందలి మీ స్థిరవిశ్వాసమును చూచి ఆనందించుచున్నాను" అని (వచనం 5) ఎందుకు చెప్పాలి? రెండవ భావము తన మనస్సులో ఉండినట్లయితే, దేవుడనుగ్రహించిన సహాయముతో, వారి ఆధ్యాత్మిక కార్యకలాపముల గూర్చి ఆయనను చైతన్యవంతుని జేయుచుండిన గ్రాహ్యతను, ఆయన తన ఆత్మలో కలిగియుండెనని అర్థమగుచున్నది.

పౌలు దైవికముగా అనుగ్రహింపబడుచుండిన సమాచారమును పొందియున్నాడని ఇతర వాక్యభాగాలు సూచింపవచ్చును (గలతీయులకు 1:6; 6:12; ఫిలిప్పీయులకు 4:2). "నేను దేహవిషయమై దూరముగా ఉన్నను, ఆత్మవిషయమై సమీపముగా ఉండి, మీతో కూడ ఉండినట్టుగానే, యిట్టి కార్యము ఈలాగు చేసిన వానిని గూర్చి యిదివరకే తీర్పు తీ ర్చియున్నాను" అని 1 కొరింథీయులకు 5:3లో చెప్పుచున్నాడు. పౌలు, కొరింథీయుల కార్యకలాపములను తన ఆత్మలో, ఎరిగియుండెనను అర్థవివరణకు, ఈ వాక్యభాగము దానంతట అదే చోటిచ్చుచున్నది. కుమారుడు మరియు తల్లి, వాని వరసలను పక్కదారిని పెట్టి ఏర్పరచుకొన్న సంబంధగల ప్రవర్తన గూర్చి ఆయన తీర్పు తీర్చగలిగాడు, ఏలయనగా ఆయన తన ఆత్మలో, వారి సంబంధం గూర్చి తెలిసికొనియుండెను.

**“మీ యోగ్యమైన ప్రవర్తనను క్రీస్తునందలి మీ స్థిరవిశ్వాసమును చూచి ఆనందించుచున్నాను” (2:5)**

పౌలు తన సమాచారమును ఎలా లేదా ఎవరి ద్వారా పొందియున్నాడనుదానితో నిమిత్తంలేకుండా, ఆయన (వారి) **యోగ్యమైన ప్రవర్తనను క్రీస్తునందలి** (వారి) **స్థిరవిశ్వాసమును చూచి ఆనందించుచున్నాడని** తన చదువరులకు తెలియజెప్పుచున్నాడు. వారు జీవించుచుండిన సత్ప్రవర్తనగల జీవితములు ఆయనకు ఆనందాన్ని కలుగజేశాయి. ఆయనకు ఆనందం కలిగించిన విషయం, విశ్వాసనీయముగా స్థిరవిశ్వాసులైయుండిన క్రైస్తవుల జీవితాలే అని అపొస్తలుడైన యోహాను కనుగొన్నాడు. “నా పిల్లలు సత్యమును అనుసరించి నడుచుకొనుచున్నారని వినుట కంటె నాకు ఎక్కువైన సంతోషము లేదని” ఆయన పలికాడు (3 యోహాను 4; 2 యోహాను 4 చూడుము). క్రైస్తవులు దైవభక్తి భయము మరియు నీతితో కూడిన జీవితములు జీవించుచున్నారని దేవుని ఉపదేశకుడు కనుగొనినప్పుడు అతని హృదయం ఆనందంతో ఉప్పొంగిపోతుంది. వారి ప్రయాసమునకు తగిన సత్ఫలితాలు దక్కినప్పుడు యేసు క్రీస్తు యొక్క మంచి దాసులు ఎంతో సంతోషిస్తారు.

పౌలు కొలొస్సయుల “యోగ్యమైన ప్రవర్తనను” (*taxis*) మరియు క్రీస్తునందలి వారి విశ్వాసము యొక్క “స్థిరత్వమును” (*stereōma*) గమనించాడు. రాబర్ట్ జి. బ్ర్యాచర్ మరియు యూజిన్ ఏ. నిడా ఈ రెండు మాటల గూర్చి ఇలా చెప్పుచున్నారు, “*Taxis* అనునది ఒక సైనిక సంబంధమైన పదమై యున్నది, దానికి ‘సువ్యవస్థితమైన శ్రేణులు,’ ‘వరసలు’ అనియు; *stereoma* అనగా ‘దృఢత్వము,’ ‘గట్టితనము’ అనియు అర్థము. ఈ పదము కూడ సైనిక సందర్భములలో వాడబడుచున్నది.”[7] సైనిక సంబంధమునకు ఆవల, ఈ పదములకు యాజక సంబంధమైన అర్థము కూడ ఉన్నది (లూకా 1:8; హెబ్రీయులకు 5:6) లేదా అపొస్తలుల కార్యములు 3:7లోవలె భౌతికముగా బలపర్చబడిన జీవితముల విషయంలో ఇదే భావమునిచ్చును.

క్రైస్తవ సమాజములో రెండు కార్యకలాపములు ఒకే సమయంలో పురోగమించుచుండ కూడదని, ఆయన కొరింథీయులకిచ్చిన ఆదేశములలో, పౌలు *taxis* పదమును ప్రయోగించాడు. ఇది విధ్వంసకమైనదగును. గనుక దానికి బదులుగా, ఆరాధన నిర్వహింపబడుటకు ఉపయోగింపబడు క్రమములో అంశములన్నియు ఒకదాని తరువాత మరొకటి వరుసగా, ఒక పద్ధతి ప్రకారము “మర్యాదగాను క్రమముగాను” నిర్వహింపబడవలెను (1 కొరింథీయులకు 14:40ను, 27 మరియు 31తో గల సందర్భమును గమనించుము) బోధకుడు బోధించుచుండగా పాట(లు) పాడుట ఆరాధనను పాడుచేయునదగును. ప్రభు రాత్రి భోజనములో పాల్గొనుచుండువారు సొంతగా ధ్యానము చేసికొనుచుండగా, పాటలు పాడుట ద్వారా అంతరాయములు కలిగించుట అక్రమమైన క్రమమగును. సంఘారాధన సక్రమంగా సాగిపోవుచుండగా, మరొక కార్యకలాపముతో ఘర్షన పడు కార్యకలాపము *taxis* అయియుండదు, అనగా అది “క్రమమైనదై” యుండదు.

క్రైస్తవుల జీవితాలు క్రమమైనవై, నియంత్రింపబడుచున్నవై, మరియు బలమైనవై యుండవలెనని పౌలు ఆశించాడు. ఆయన ఎలాగైతే, ఎందుకైతే తన సొంత జీవితం బలపర్చబడుచున్నదై యుండవలెనని ఆశించాడో, అదే విధంగా వారు కూడ బలపర్చబడినవారై యుండవలెనని ఆయన ఆశించాడు. “... ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే

భ్రష్టుడనైపోదునేమో అని, నా శరీరమును నలగగొట్టి, దానిని లోపరచుకొనుచున్నాను" అని ఆయన వ్రాసాడు (1 కొరింథీయులకు 9:27).

విశ్వాసమునకు ఒక మూలాధారముండవలెను. అట్టి మూలాధారము ఉపదేశములు, ఇతరులు, లేదా భౌతికమైన విషయములై యుండవచ్చును. క్రైస్తవుల విశ్వాసము యేసు క్రీస్తు నందుంచబడుతుంది – అది భౌతికమైన దీవెనల కొరకు మాత్రమే కాదు (మత్తయి 6:33) కానీ ఆధ్యాత్మిక ఆశీర్వాదముల కొరకు కూడ ఉంచబడుచున్నది (ఎఫెసీయులకు 1:3). క్రైస్తవ జీవితము యేసు క్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారా మొదలౌతుంది, ఆయనయందలి విశ్వాసముతో ముందుకు సాగుతుంది, ఆయనయందలి విశ్వాసముతోనే దాని లక్ష్యమును సాధిస్తుంది (రోమీయులకు 1:17). ఆయన క్రైస్తవుల జీవితములకు కేంద్రము మరియు నిరీక్షణయునై యున్నాడు (యోహాను 14:6); రక్షణ యేసు క్రీస్తు తప్ప మరెవరి వలనను కలుగదు (అపొస్తలుల కార్యములు 4:11, 12).

కొలొస్సయుల జీవితము గూర్చి ఆయన నేర్చుకొనిన దానినిబట్టి, వారు చక్కగా సాగిపోతున్నారనియు, వారి విశ్వాసము యథార్థమైనదై యున్నదనియు పౌలు తెలిసికొన్నాడు. అట్లయినను వారు లౌకిక సుఖభోగాలు, ఉద్రేకమును ఉసిగొలుపు కర్మకాండలు, మానవ తత్వము, లేదా ఒప్పించుచుండు ప్రసంగములు చేత కొట్టుకొనిపోకూడదని ఆయన వారిని హెచ్చరించకుండునట్లు ఈ వాస్తవము ఆయనను ఆటంకపరచలేదు. కొందరు సత్యము కంటె ఎక్కువగా వ్యక్తిత్వముల ద్వారా ప్రభావితము చేయబడుచున్నారని ఆయన అర్థంచేసికొన్నాడు. యథార్థమైన విశ్వాసము కాపాడుకొనబడవలెను, ఏలయనగా అది తెరపిలేని సవాళ్లను ఎడతెరపిలేకుండా ఎదుర్కొనుచుండును.

కొలొస్సయుల ఆధ్యాత్మిక సంక్షేమము గూర్చి ఆందోళనచెందునట్లు గాని, వారిని ప్రోత్సాహించునట్లుగాని పౌలు శరీర రీతిగా వారి మధ్యనే ఉండవలసిన అవసరం లేకుండినది. ఆయన వారితో కూడ లేకుండినప్పటికిని వారి ఆధ్యాత్మిక అవసరముల గూర్చి తన ఆత్మలో యోచించగలిగాడు గనుక వాటిని తీర్చగల తరుణోపాయములను వెదకగలిగాడు.

## ఆయన మందలింపు: వారు క్రీస్తును అంగీకరించినట్లుగానే ఆయనయందుండి నడుచుకొనవలెను (2:6)

**6కావున మీరు ప్రభువైన క్రీస్తుయేసును అంగీకరించిన విధముగా ఆయనయందుండి నడుచుకొనుడి.**

**"కావున మీరు ప్రభువైన క్రీస్తు యేసును అంగీకరించిన విధముగా ..." (2:6)**

**కావున** (*oun*) అను పదము ఈ ఆలోచనను "బుద్ధి జ్ఞానములు" క్రీస్తునందే గుప్తములై యున్నవను మాటలతో (వచనం 3) జోడించుచున్నది. వారికి ఈ సర్వసంపదలు క్రీస్తునందు అందుబాటులో ఉన్నాయని వారు ఎరిగియుండి, కొలొస్సయులు యేసుక్రీస్తును మాత్రమే అంటిపెట్టుకొనియుంటూ, వారి జీవితములను ఆయన ఇచ్చిన ఆజ్ఞల పరిధులకే పరిమితము చేసికొనవలసి యుండినది. వారు ఆయనను సర్వ సత్యమునకు మూలాధారముగాను, ప్రభువుగాను మరియు మెస్సీయగాను అంగీకరించారు, కానీ యేసు క్రీస్తును అంగీకరించుటతో

దేవుని యెడల చూపించవలసిన విధేయత ముగియలేదు. ముఖ్యముగా, అది క్రైస్తవ నడకకు ఆరంభమై యున్నది. క్రైస్తవ జీవితము ఎలా ఆరంభమయ్యిందో, దాని అభివృద్ధి కూడా ఆలాగే ఆరంభమునకు తగినదై నిలుకడగా నిలిచియుండవలెను.

కొలొస్సయులు యేసును ప్రభువైన క్రీస్తుగా అంగీకరించారు; జ్ఞానముగల ప్రతి ఆధ్యాత్మిక ఆలోచన మరియు తెలిసికొనదగు సత్యము కలిగియున్నవానిగా ఆయనను గుర్తించారు. క్రీస్తుగా, ఆయన దేవుని చేత అభిషేకింపబడిన అధిపతియై యున్నాడు, ఆయన ఇప్పుడు భూమ్యాకాశములను ఏలుచున్నాడు (మత్తయి 28:18). "యేసు"గా ("దేవుడు రక్షించును"; మత్తయి 1:21 చూడుము), ఆయన దేవుడనుగ్రహించు పాపక్షమాపణా సాధనమై యున్నాడు. 'ప్రభువు'గా (రోమీయులకు 10:9), ఆయన ఒకడు లోబడదగు మరియు లోబడవలసిన (లూకా 6:46) ఒక్కడే ప్రభువై యున్నాడు (ఎఫెసీయులకు 4:5). ఆయనకు విరోధముగా తిరుగుబాటు చేయువారు పాపమునకు దాసులై యున్నారు మరియు వారు "నాశనము" చేయబడుదురు (అపొస్తలుల కార్యములు 3:23). హృదయపూర్వకముగా సువార్తకు లోబడుట ద్వారా, కొలొస్సయులు నీతికి దాసులయ్యారు (రోమీయులకు 6:17, 18).

వారు బాప్తిస్మము పొందిన సమయములో నూతన జీవము లోనికి రూపాంతరము చెందారు, అప్పుడు వారు ఆయనతో కూడ ఆయన మరణ పునరుత్థానములలో పాలుపంచుకొనుట ద్వారా (రోమీయులకు 6:4) యేసును అంగీకరించినవారయ్యారు. యేసుతో కూడ లేపబడినవారయ్యారు (కొలొస్సయులకు 2:12), గనుక ఇప్పుడు వారి సహవాసము ఆయనతో కూడ కొనసాగుచుండవలెను మరియు వారు పాపములో పాల్గొనుచుండుటను మానివేయబడవలెను (రోమీయులకు 6:5, 6).

గ్రీకు క్రియ *paralambanō* ("అంగీకరించుట") సాధారణంగా ఒకరు వారి చేతుల మీదుగా మరొకరికి ఏదో ఒకటి అందజేయునప్పుడు దానిని అంగీకరించుట యను అర్థమిచ్చును.[8] కొలొస్సయులు ఎపఫ్రా తెచ్చిన సందేశము ద్వారా యేసును "అంగీకరించారు" గనుక తత్ఫలితము వారు యేసుక్రీస్తునందు కొనసాగుచుండుటయై యుండవలెను. వారికి ప్రారంభ స్థానము మరియు వారి జీవితముల కేంద్రము, ఆయనే. ఆయన ఇచ్చిన ఆజ్ఞలను గైకొనుచుండుట ద్వారా వారు ఆయనయందు నిలిచియుందురు (1 యోహాను 2:3). వారు ఆయనతో నడుచుకొనుచుండుట మాత్రమే కాదు, కానీ ఆయనలో నడుచుకొనుచుండవలసి యున్నది; వారు నడుచుకొనవలసిన పరిధులను ఆయనే నియమించాడు. క్రైస్తవ నడక ఆయనలోనే సాగుచుండవలెను, కానీ ఆయనకు వెలుపల కాదు.

బహుశా పరిశుద్ధాత్మ పౌలు ద్వారా, జ్ఞానతత్వవాదులు అటుతరువాత రోజుల్లో బోధించు అబద్ధ అవగాహనలకు సముచితమైన సమాధానము నిచ్చుటకు ఒక విలువైన సందేశమును సమకూర్చుచుండవచ్చును. ఏ. టి. రాబర్ట్‌సన్ ఇలా చెప్పుచున్నాడు,

> ఆయన అందరికి ప్రభువైన ఆధిపత్యము కంటెను అధికారముకంటెను ఎంతో హెచ్చైనవాడై యున్నాడు (ఎఫెసీయులకు 1:21). సెరింథియన్ జ్ఞానతత్వవాదులు (యోహానుకు సమకాలీనుడును, ఆయనను వ్యతిరేకించినవాడునైన సెరింథస్ స్థాపించిన జ్ఞానతత్వవాదలు) మొదటి శతాబ్దము ముగియుచుండిన రోజుల్లో మానవుడైన (*man*) యేసును, ఆయన బాప్తిస్మము పొందుకొనినప్పుడు ఆయన మీదికి దిగివచ్చి సిలువ మీద ఆయనను విడిచిపెట్టిన దైవికమైన (*aeon*) క్రీస్తు నుండి అతి తీవ్రంగా ప్రత్యేకపరచారు. ఈ సిద్ధాంతము గూర్చిన

> సమాచారము కొలొస్సయిలో బహుశా ముందుగానే తెలిసియుండవచ్చును. పౌలు ఇక్కడ నొక్కివక్కాణించుచున్న విషయము కేవలము యేసు మరియు క్రీస్తు యొక్క గుర్తింపు కాదు, కానీ యేసు యొక్క మెస్సీయాత్వము గూర్చి ఆయన మనస్సులో ఉన్నా లేకున్నా అది ఆయన యొక్క ప్రభుత్వము మరియు నాయకత్వమును గూర్చినదై యున్నది. పౌలుకు యేసుక్రీస్తు, సత్యదూరమైన పౌరాణిక గాథ కాదు లేదా చరిత్రకును ఆయనకును సంబంధమేలేనివాడు కాదు. లోకమంతా యేసును చరిత్రకే తలమానికమైన పురుషునిగా గుర్తించి ఆయన దైవత్వమును ఒప్పుకొన్నది.[9]

6వ మరియు 7వ వచనంలో ఐదు రూపకాలంకారములు ప్రయోగింపబడనవి. (1) యేసుక్రీస్తునందు "నడుచుకొనుడి" అను ఆదేశము యేసే మార్గమై యున్నాడని సూచించుచున్నది. (2) "వేరుపారినవారై" అను పదము, ఒక చెట్టు దాని పోషణ మరియు సత్తువ కొరకు తన వేర్లను నేల లోనికి లోతుగా వ్యాపింపజేసుకొనుచున్నదను ధ్వనింపునిచ్చుచున్నది. (3) "కట్టబడుచు" అను పదము బాగుగా కట్టబడిన కట్టడము యొక్క బలమును సూచించుచున్నది. (4) "స్థిరపరచబడుచు" అనగా వారు విశ్వాసమందు చక్కగా స్థిరపడిపోయారని అర్థము. (5) "నేర్చుకొనినిన" అను పదము దీనికి ముందటి నాలుగు కార్యకలాపములు చేయుచుండుటకు వారికవసరమైన సమాచారమును వారు పొందియున్నారని బయలుపరచుచున్నది.

పౌలు యొక్క మందలింపు సారాంశము ఈ క్రింది విధముగా నున్నది ...

> మీరు క్రీస్తును అంగీకరించిన విధముగానే, "ఆయనయందుండి నడుచుకొనుడి" (వచనం 6).
>
> వేరుపారినవారయ్యారు కాబట్టి, బాగుగా "కట్టబడుడి" (వచనం 7).
>
> మీకు ఆదేశములియ్యబడిన విధంగా, "మీ విశ్వాసమునందు స్థిరపరచబడినవారై యుండుడి" (వచనం 7).

### "ఆయనయందుండి నడుచుకొనుడి" (2:6)

**నడుచుకొనుడి** (*peripateō*) – యేసు సముద్ర తీరమున నడిచివెళ్ళుచుండినప్పటి ఆయన భౌతిక కదలికలు ప్రస్తావింపబడిన సందర్భములో వాడబడినది (మత్తయి 4:18). ఆధ్యాత్మికముగా చూచినట్లయితే, "నడుచుకొనుట" అనగా ఒక నిశ్చితమైన రంగంలో పురోభివృద్ధి చెందుట యని అర్థము. చీకటిలో (యోహాను 8:12), పగటి వేళ లేదా రాత్రి వేళ (యోహాను 11:9, 10), వెలుగులో (యోహాను 12:35), నూతన జీవములో (రోమీయులకు 6:4), శరీరేచ్ఛల ప్రకారము (రోమీయులకు 8:4), విశ్వాసముతో (2 కొరింథీయులకు 5:7), పరిశుద్ధాత్మ చేత (గలతీయులకు 5:16), పాపములో (ఎఫెసీయులకు 2:1, 2), సత్క్రియలలో (ఎఫెసీయులకు 2:10), ప్రేమ కలిగి (ఎఫెసీయులకు 5:2), అక్రమముగా (2 థెస్సలొనీకయులకు 3:11; KJV), మరియు సత్యములో (2 యోహాను 4) కూడ నడువవచ్చును. క్రైస్తవ జీవితములోని కదలికలను దృష్టిలో ఉంచుకొని, పౌలు "నడుచుకొనుడి" అని అర్థమిచ్చు గ్రీకు పదమును ఈ పత్రికలో నాలుగు పర్యాయములు ప్రయోగించాడు (1:10; 2:6; 3:7; 4:5; KJV), వారు విశ్వాసమందు

నిలుకడగా నిలువబడుచు (1 కొరింథీయులకు 16:13), క్రీస్తునందు నిశ్చలముగా నడుచుకొనుచుండవలెనే కానీ, ఎన్నడైనను ఊరకనే వృథాగా కూర్చోని ఉండకూడదని క్రైస్తవులకు ఉద్బోధింపబడినది.

కొలొస్సయులు, వారు యేసుక్రీస్తును అంగీకరించినప్పుడు కలిగియుండిన అదే నమ్మకము మరియు (ఆత్మ) విశ్వాసముతో ఇప్పుడు యేసు క్రీస్తునందు నడుచుకొనవలసినవారై యుండిరి. వారు ఆయనయందు ప్రవేశించినప్పుడు మాత్రమే ఆయనయందుండి నడుచుకొనగలరు. ఆయనయందలి విశ్వాసముతో, బాప్తిస్మమందు వారు ఆయనతో కూడ పాతిపెట్టబడినప్పుడు, వారు యేసు లోనికి ప్రవేశించారు (రోమీయులకు 6:3, 4; గలతీయులకు 3:26, 27). ఒకసారి ఆయన లోనికి ప్రవేశించిన తరువాత, ఆయన నడుచుకొనినట్లుగా వారు కూడ నడుచుకొనవలసినవారై యుండిరి (1 యోహాను 1:6).

## పౌలు ప్రోత్సాహము: క్రీస్తు యేసునందు కట్టబడవలెను (2:7)

**[7]కావున మీరు ప్రభువైన క్రీస్తుయేసును అంగీకరించిన విధముగా ఆయనయందు వేరుపారినవారై, యింటివలె కట్టబడుచు, మీరు నేర్చుకొనిన ప్రకారముగా విశ్వాసమందు స్థిరపరచబడుచు, కృతజ్ఞతాస్తుతులు చెల్లించుటయందు విస్తరించుచు, ఆయనయందుండి నడుచుకొనుడి.**

### "వేరుపారినవారై" (2:7)

క్రైస్తవులకు అవసరమైయుండిన విషయములను చిత్రీకరించుటకు, పౌలు మూడు అసమాపక క్రియాపదములను ఉపయోగించాడు: **వేరుపారినవారై,** "కట్టబడుచు," మరియు "స్థిరపరచబడుచు."

"వేరుపారిన" (*hrizoō* నుండి వచ్చిన *errizōmenoi*) – అనగా, "వేరుపారజేసికొనునట్లు చేయుట" అని అర్థము. గట్టిగా బిగింపబడి/అచంచలముగా అమర్చబడి యుండుటను సూచించుటకు ఈ పదము అతి తరుచుగా అలంకారికంగా వాడబడుచున్నది. ఈ పదము క్రొత్త నిబంధనలో ఇచ్చట మరియు ఎఫెసీయులకు 3:17లో మాత్రమే కనిపించుచున్నది. సంపూర్ణ కర్మార్థక క్రియాజన్య విశేషణమై యుండుటను బట్టి, "వేరుపారిన" అను పదము గతములో సంపూర్తిచేయబడినదే కానీ కొనసాగుచున్న ఫలితము కనబడుచుండు ఒక చర్యను తెలియజేయుచున్నది. యేసును అంగీకరించి ఆయనలోనికి ప్రవేశించుట ద్వారా, పౌలు చదువరులు యేసు క్రీస్తునందు వేరుపారినవారయ్యారు. యేసుతో గల ఈ సంబంధమును కొనసాగించుచు, వారు ఎల్లప్పుడు ఆయనయందే నిలిచియుండవలసినవారై యుండిరి.

ఎదుగుచు గట్టిగా నాటబడినవై నిటారుగా నిలిచియుండగలుగునట్లు మొక్కలలో అధిక శాతం మొక్కలకు రెండు విషయములు అవసరమై యుండును. మొదటిది, వాటి వేర్లను అవి మంచి నేల లోతుల్లోనికి పారజేసికొనవలెను. రెండవది, అవి నేలలో లభించు పోషణను ఆధారం చేసికొంటూ ఎదుగుచుండవలెను. వేర్లు, సుస్థిరత్వమును మరియు ఎదుగుదలను సమకూర్చును. వారు క్రీస్తునందు లభించు పోషణ ద్వారా కట్టబడుచు ఎదుగగలుగునట్లు క్రైస్తవులు క్రీస్తునందు నిశ్చలముగా వేరుపారినవారై యుండవలెను. మనము యేసునందు

నిశ్చలముగా నాటబడినవారమైనట్లయితే, అంత సులభంగా మన వేర్లు పెకలింపబడవు. కొలొస్సయులు వారి క్రైస్తవ జీవిత గమనము నుండి చలించకపోనప్పటికిని, వారు ఆనందంగా ఆరంభించిన జీవితంలో ఎదుగుచునే యుండునట్లు వారిని ప్రోత్సాహించవలెనని పౌలు ఆశించాడు.

**"ఆయనయందు ... కట్టబడుచు" (2:7)**

**కట్టబడుచు** (*epoikodomoumenoi*) - ఒక కట్టడమును కట్టుచుండుటకు, కొన్ని నిర్దిష్టమైన లక్షణములను అభివృద్ధిచేసికొనుటకు, లేదా ఒక సహేతుకమైన కార్యము యొక్క సఫలీకృతము నిమిత్తము ప్రయోసపడువారి సంఖ్యను పెంచుటకు తోడ్పడుటను సూచించుచున్నది. అదివరకే మరొకరి చేత కట్టబడియున్న కట్టడము మీద కట్టుటకు సంబంధించి మరియు సహకారముతో కొనసాగుచుండు ప్రయాసము గూర్చి పౌలు ఈ పదమును వాడుచున్నాడు (1 కొరింథీయులకు 3:10-14). రూపకాలంకార దృష్ట్యా, ఎఫెసీయులకు 2:20లో, ఇతరులు కూడ యేసు క్రీస్తు యొక్క సంఘములో భాగమగునట్లు వారిని తీసికొని వచ్చుటను గూర్చి అది తెలియజేయుచున్నది. ఒక ఆధ్యాత్మిక కట్టడమును కట్టుట గూర్చి ప్రస్తావించుచుండినప్పుడు పేతురు కూడ ఇటువంటి పదమునే ఉపయోగించాడు (1 పేతురు 2:5), విశ్వాసమును పెంపుదల చేసికొనుట గూర్చి సూచించిన సందర్భంలో, యూదా కూడ ఈ పదమును అన్వయించాడు (యూదా 20).

ఒక వర్తమానకాలిక కృదంత విశేషణంగా, "కట్టబడుచు" అను పదము కొనసాగుచున్న చర్యను తెలియజేయుచున్నది. కొలొస్సయులు నిశ్చలంగా వేరుపారినవారైయుండి, నిశ్చలంగా వేరుపారినవారై యుండుటకు కొనసాగవలసి యుండినది. దీనిని మూలాధారంగా చేసికొని, వారు యేసునందు "కట్టబడుచుండుట" కొనసాగుచుండవలెను.

క్రైస్తవులు దేవుడు నిర్మించిన కట్టడమై, అపొస్తలులు, ప్రవక్తలు, మరియు యేసు అనగా, మూలకు తలరాయియైనవాడు వేసిన పునాది మీద వారు కట్టబడియున్నారు (1 కొరింథీయులకు 3:9, 11; ఎఫెసీయులకు 2:20, 21). యేసు, శిరస్సైయున్నవాడు, మరియు సభ్యుల చేత సమకూర్చబడుచుండు దాని ద్వారా, సంఘము కట్టబడుచున్నది (ఎఫెసీయులకు 4:12, 16; 1 థెస్సలొనీకయులకు 5:11; 1 పేతురు 2:5). పరిపక్వత చెందునట్లు, క్రైస్తవులు క్రీస్తునందు నిలిచియుండి ఆయన యందు లభ్యమగు తెలివి ద్వారా నూతనపరచబడుచుండుటకు కొనసాగుచుండవలెను (కొలొస్సయులకు 3:10). క్రీస్తు పట్ల విశ్వాసపాత్రముగా నిలిచియుండుట మరియు ఆయనతో సన్నిహిత సంబంధమును కలిగియుండుట ఆధ్యాత్మిక పరిపూర్ణతకు అత్యావశ్యకమైన అంశములై యున్నవి. ఆయనయందు - ఆధ్యాత్మిక జీవితమునకు అవసరమైయున్న వనరులను సహోదరులను విశ్వాసమందు నిశ్చలముగా బంధించియుంచగల సూత్రమును సూచించుచున్నది. మనము ఆయనయందు కట్టబడుచున్న వారమైనట్లయితే, మనము ఆయన బలమును కలిగియుందుము గనుక సులభముగా కూలద్రోయబడజాలము లేదా ఆధ్యాత్మికముగా నాశనము చేయబడజాలము.

ఆధ్యాత్మికాభివృద్ధి యేసు వలన కలుగును గనుక, కొలొస్సయులు కట్టబడుచుండుటకు మరొక సాధనోపాయము కొరకు వెదకవలసిన అవసరం వారికి ఏర్పడలేదు. వారు

నాటబడిన వానిలో నుండే వారి ఎదుగుదలకు అవసరమైన పోషణను వారు వెదకవలసి యుండినది. యేసునందు వేరుపారినవారై యుండుట అనగా, వారి ఎదుగుదల ఆయన నుండే కలుగవలసి యున్నదని అర్థము. వారు యేసును పునాదిగా ఆధారంచేసికొని ఆయన మీద కట్టబడియున్నారు గనుక, వారు సుస్థిరత్వము కలిగియుండి, వారు వేసికొన్న పునాదినే మరలా మరలా వేసికొనవలసిన అవసరం రాదు (హెబ్రీయులకు 6:1).

ఆధ్యాత్మిక పరిపూర్ణతను అభివృద్ధి చేసికొనుటకు మరొక మార్గమున్నదా? సంఘ సదాచార కర్మలు మరియు "ఇవన్నీ పరిశుద్ధాత్మ వలననే కలుగుచున్నవని" ఆరోపింపబడు భావోద్రేకములతో నిండియున్న అభ్యాసములు క్రీస్తునందు ఎదుగుటకు మార్గములు కావు. అధ్యాత్మికత్వము సంపాదించుకొనుటకు ఈ విశాలమైన వీధులను వెదకుచుండువారు సమస్త ఆధ్యాత్మిక ఎదుగుదలకు మూలాధారము యేసే అని అర్థంచేసికొనని వ్యర్థులగుచున్నారు.

**"మీరు నేర్చుకొనిన ప్రకారముగా, విశ్వాసమందు స్థిరపరచబడుచు" (2:7)**

**స్థిరపరచబడుట** (*bebaioumenoi*) – ప్రాథమికంగా, "నిస్సంశయముగా ఋజువుచేయబడినదని" దీని అర్థము. బోధింపబడుచుండు వాక్యమును స్థిరీకరణము చేసికొనుట, ఇటువంటి రుజువుకు సరిపడు ఉదాహరణమై యున్నది (మార్కు 16:20). ఇదే అభివ్యక్తము, అవి నిజమైయున్నవని ప్రమాణీకరింపబడిన వాగ్దానముల విషయంలోను (రోమీయులకు 15:8), క్రీస్తునకు సంబంధించిన సాక్ష్యము స్థిరపడిన విషయంలోను (1 కొరింథీయులకు 1:6) వాడబడినది. పౌలు అపొస్తలత్వము యథార్థమైనదనుటకు ఒక సంకేతముగా పరిశుద్ధాత్మ కొరింథీయులకు అద్భుతకరమైన వరములను అనుగ్రహించాడు (1 కొరింథీయులకు 9:1, 2; 12:4–11; 2 కొరింథీయులకు 12:12). విశ్వాసులు స్థిరచిత్తంగలవారుగా, వారి ఒప్పింపులలోను సంకల్పములలోను నిశ్చలతగలవారుగా చేయబడిన సందర్భంలో కూడ "స్థిరపరచబడుట" అను పదము వాడబడినది (1 కొరింథీయులకు 1:8; 2 కొరింథీయులకు 1:21; హెబ్రీయులకు 13:9).

కొలొస్సయులు, (వారు) **నేర్పింపబడినట్లుగానే విశ్వాసమందు** స్థిరపరచబడిరి. "*మీ విశ్వాసములో*" అనుటకు బదులుగా, గ్రీకు వాక్యభాగములో *tē pistei,* అని వ్రాయబడి యున్నది, అనగా "విశ్వాసము(లో)" అని దీని అర్థము, 1:23లో కూడ ఇలాగే వ్రాయబడి యున్నది. "విశ్వాసము" అను పదము ద్వారా, "క్రైస్తవ ఉపదేశముల మొత్తమంతా, క్రైస్తవుల చేత విశ్వసింపబడుటకు బయలుపరచబడిన మొత్తము సత్యము" అని పౌలు భావించాడు.

"నేర్పింపబడన" (*didaskō*) – ఒకరు ఏమి చేయవలెనో వారికి 'నేర్పించుట' లేక 'చెప్పుట'కు యథాప్రకారమైన పదమై యున్నది (మత్తయి 4:23; 28:15). వారు దేవుని వాక్యములో నుండి నేర్చుకొనిన విషయములలో కొలొస్సయులు నిలిచియుండవలెనని పౌలు ఆశించాడు (రోమీయులకు 10:17). వారు విశ్వాసములో స్థిరులై యుండవలెను, వారి జీవితములను వారు వినిన సత్యము మీద కట్టుకొనవలెను, నేర్చుకొనుట మానక కొనసాగుచుండవలెను. వారి విశ్వాసములో వారు స్థిరపరచబడినవారైనట్లయితే, అబద్ధ బోధల వలన అంత సులభంగా ఒప్పింపబడరు లేదా అంత త్వరగా విశ్వాసభ్రష్టులు కారు.

ఎపఫ్రా వారికి సరిగా నేర్పించాడు. గనుక వారు ఈ ఉపదేశము నుండి పెడదారిపట్టుటకు బదులుగా, ఆధ్యాత్మికముగా పరిపూర్ణులగునట్లు గట్టి పట్టుదలగలవారిగా

కొనసాగుచుండవలెను. వారు సరిగా నేర్పింపబడలేదను సందేహము పౌలుకు కలుగలేదు లేదా వారు జీవించుచుండిన శైలిని ఆయన ప్రశ్నించనూలేదు. వారు దేనినైతే ఆరంభించారో దానిలోనే, అదేవిధంగా కొనసాగుచు, యేసు చూపించిన మాదిరి ప్రకారము వారి జీవితములను అభివృద్ధి చేసుకొనుచుండవలెనని ఆయన వారిని ప్రోత్సాహించాడు.

మానవుడు జీవించునట్లు వానికి దేవుని వాక్యము అగత్యమైనదై యున్నది (మత్తయి 4:4 చూడుము). సమస్త లేఖనములు దేవుని చేత ప్రేరేపింపబడినవనియు ఒక క్రైస్తవుడు "దైవజనుడు సన్నద్ధుడై, ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు" చేయగల సత్యములను కలిగియున్నవనియు, పౌలు రచించాడు (2 తిమోతి 3:16, 17). ఇందునుబట్టియే అతడు వాక్యమును ఉపదేశించవలెననియు దానిని బోధించుచుండవలెననియు పౌలు తిమోతిని మందలించాడు (1 తిమోతి 4:11; 6:2; 2 తిమోతి 2:2; 4:2). వాక్యము ద్వారా ఎదుగుదల కలుగునని పేతురు నేర్పించాడు (1 పేతురు 2:2). క్రైస్తవ సుస్థిరతకును పరిపూర్ణతకును వాక్యోపదేశము మూలాధారమై యున్నది మరియు అది ఆధ్యాత్మిక శక్తికి ఆధారమై యున్నది (హెబ్రీయులకు 4:12).

పౌలు తన చదువరుల కొరకు ఒక క్రొత్త బోధను ప్రతిపాదించలేదు. వారికవసరమైయుండిన సత్యములను వారు అంగీకరించారు. వారు క్రొత్త ఉపదేశములను వెదకనవసరంలేదు, దానికి బదులుగా వారు అంగీకరించిన ఉపదేశముల మీదనే కట్టబడుచుండవలెను. వారు అదివరకే నేర్చుకొనిన ఉపదేశముల ప్రకారము లేని ఏ నూతన బోధయైనను, అది అబద్ధ బోధయై యుండును (గలతీయులకు 1:7, 8 చూడుము). యేసు చేత బయలుపరచబడిన దానికి వెలుపల, మనము నూతన సిద్ధాంతములను వెదకవలసిన అవసరంలేదు; ముఖ్యముగా, మనము పరిపూర్ణత దిశగా ఆయన ప్రవేశపెట్టిన సత్యములో ఎదుగవలసినవారమై యున్నాము (హెబ్రీయులకు 6:1).

### "కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట యందు విస్తరించుచు" (2:7)

వారి విశ్వాసము యొక్క లక్ష్యము మరియు నిరీక్షణ యొక్క ఎదురుచూపు నిత్యజీవమై యుండినందు వలన, వారి హృదయాలు **పొంగిపొర్లుచున్నవై యుండవలెను** (*perisseuō*). మరొక పర్యాయము, పౌలు వర్తమానకాలిక కృదంత విశేషణాన్ని వాడుచు, కొనసాగుచున్న కార్యమును తెలియజేయుచున్నాడు. వారు **కృతజ్ఞతతో** "విజృంభించుచునే" లేక "పర్యాప్తమగుచునే" యుండవలెనని ఆయన భావించాడు. కొలొస్సయుల కృతజ్ఞత అదివరకే విస్తరించి యుండినప్పటికిని, వారు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట యింకను ఎడతెరిపిలేని కార్యమై యుండవలెనని పౌలు వారిని ప్రోత్సాహించాడు.

పరలోకము కొరకు ఎదురుచూచుటతో పాటు, దైవభక్తి భయము గల జీవితము నుండి పొందుచున్న ఆశీర్వాదములు, పాపదోషభావము నుండి అనుభూతి చెందుచుండిన స్వాతంత్రము, యేసు మరియు తోటి విశ్వాసులతో గల సహవాసమునుబట్టి కొలొస్సయులు కృతజ్ఞతగలవారై కూడ ఉండవచ్చును. ఈ మేళ్లన్నీ వారి సొంత సాధనల వలన కాదు, కానీ దేవుని నుండియే కలుగుచున్నవను గ్రహింపు వారు ఆయనను అనగా, సకలాశీర్వాదములకు కారణభూతుడైయున్నవానిని (యాకోబు 1:17) అత్యధిక అభిమానంతో ఆరాధించుచున్నవారై యుండునట్లు చేయవలెను. వారు యేసు క్రీస్తు ద్వారా పొందుచున్న మేళ్లనుబట్టి వారి

హృదయాలు వినయపూర్వకమైన కృతజ్ఞతాస్తుతులతో నిండియుండవలెను.

కృతజ్ఞత, సంతృప్తిని కలుగజేయును, ఇట్టి సంతృప్తి సుస్థిరతను కలుగజేయు ప్రభావమును సమకూర్చును. వారు కలిగియున్న వాటితో తృప్తిచెందుచు వాటియందు ఆనందానుభూతి పొందువారు దాదాపుగా దానిని కలిగియుండగలవారై యున్నారు. యేసు సంతృప్తినిచ్చును, హృదయములను నింపును, యేసు వలె ఈ పనులను యింకెవరైనను చేయలేరు (యోహాను 4:14). వారి ఆధ్యాత్మిక అవసరములను సమృద్ధిగా సమకూర్చుచు, వారి హృదయములను కృతజ్ఞతాస్తుతులతో నింపుటకు కొలొస్సయులకు ఇతరులెవరైనను అవసరము లేకుండినది.

ఈ విభాగములో నున్న సవాలు స్పష్టముగా నున్నది: కొలొస్సీలోని క్రైస్తవులు నిలకడగా ఎదుగుచుండవలెనని పౌలు ఆశించాడు. ఆర్. సి. లూకాస్ ఈ విషయాన్ని ఇలా క్లుప్తీకరించాడు:

> అలాగైతే, పౌలు ప్రశాంతమైన తృప్తినిబట్టి సంతృప్తిచెందెడివాడు కాదని ఈ విభాగములోని మూడింతల పిలుపులు స్పష్టముగా చూపించుచున్నవి. వారి జీవిత విధానము సంపూర్ణంగా సుస్థిరమైనదిగాను, వారి ఆధ్యాత్మిక ఉన్నతి నిండుగా నిండినదిగాను, వారి తెలివి అనేక విషయములను విస్తారముగా అవగాహనచేసికొన్నదిగాను ఉండవలెనని ఆయన తన చదువరులకు పిలుపునిచ్చుచున్నాడు. అయితే ఈ ఎదుగుదలంతా యథార్థమైనదై యుండవలెను, అప్పుడది ఎల్లప్పుడు రక్షణను కలుగజేయు క్రీస్తు సువార్త యొక్క సామరస్యముతో కూడిన అభివృద్ధియై యుండును.[10]

## అన్వయము

### క్రీస్తు, బుద్ధి జ్ఞానములకు మూలాధారం

మనము మన జీవితములను క్రీస్తు మీద కట్టుకొనుచుండవలెనని స్పష్టము చేయుటకు పౌలు, క్రీస్తు యొక్క ప్రాముఖ్యత మరియు అధికారము గూర్చి ఒక బలమైన సందర్భమును నివేదించాడు. మనము పౌలు చూపిన మాదిరిని అనుకరించుచు, వారు యేసును యథార్థముగా వెంబడించుచున్నవారై యుండవలెనని ఇతరులకు నేర్పించుట గూర్చి ఆందోళన చెందుచున్నవారమై యుండవలెను.

పౌలు వలె, యేసు వారి జీవితములకును ఎంతో ప్రాముఖ్యమైనవాడను అవగాహనను ఇతరులలో కలుగజేయుటకు మనము ప్రయాసపడవలసి యున్నది. అట్లయితే, మన ప్రయాసములు కూడ పౌలు అనుసరించిన మార్గనిర్దేశనములను అనుసరించుచున్నవై యుండవలెనని అర్థమగుచున్నది. క్రైస్తవులు ఈ క్రింది విషయములను కలిగియుండునట్లు ఆయన పోరాడాడు:

(1) *ప్రోత్సాహింపబడిన హృదయములు.* వారి కార్యశీలమైన విశ్వాసము యొక్క అభ్యుదయమును మరియు ఫలితార్థమును చూచునప్పుడు ఎవరి హృదయములైతే ఉప్పొంగినవై పైకెత్తబడునో, వారు తమ్మును తాము ప్రతిష్ఠించుకొనిన క్రైస్తవులై యున్నారు. ఆయన పడిన ప్రయాసమునకు ఫలితముగా క్రైస్తవులైనవారు సత్యములో నడుచుకొనుచున్నారని తెలిసికొనినప్పుడు యోహాను హృదయము సంతోషముతో నిండిపోయింది (3 యోహాను 4).

పరిస్థితులు క్లిష్టమైనవై, మనము చేయుచున్న ప్రయాసమంతా విఫలమగుచున్నట్లు అనిపించినప్పుడు, మన హృదయము సులభంగా నిరాశచెందును. ఔత్సుకతో నిండిన హృదయం అలాగే నిలిచియుండునట్లు, మనము మన దృష్టినంతా మన లక్ష్యముల మీద నిలిపియుంచుచు, చివరకు మన సకల ప్రయాసములు సఫలీకృతమగునట్లు దేవుడు దీవించునని తెలిసికొనవలెను. మన "ప్రయాసము ప్రభువునందు వ్యర్థముకాదని" తెలిసికొన్నవారమై, ఎడతెరపిలేకుండా మనము యేసును సేవించవలెనని పౌలు రచించాడు (1 కొరింథీయులకు 15:58).

మనలను ఆపదలు అలుముకొన్నప్పుడు, నిరాశచెందుటకు బదులుగా మనము వాటి నుండి పొందగల మేళ్లు: పట్టుదల, సద్గుణము, మరియు నీతిలో కలుగు ఎదుగుదలనుబట్టి (రోమీయులకు 5:3, 4; యాకోబు 1:2; హెబ్రీయులకు 12:11) మనము ప్రోత్సాహింపబడినవారము కావలెను. మనకు పరీక్షలు ఎదురౌతున్నాయంటే, దేవుడు మనలను ప్రేమించుచున్నాడు గనుక మనలను మల్చుచు, మనము ఆయన పనులకు పనికివచ్చు మంచి పనిముట్లుగా చేయుటకు మన జీవితముల యందు ఆయన తన కార్యములను చేయుచున్నాడని అర్థం. "**ప్రభువు** తాను ప్రేమించువారిని శిక్షించి, తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును" (హెబ్రీయులకు 12:6).

పౌలు పడిన ప్రయాసములు, ఆయన ఎదుర్కొన్న కష్టములు మరియు హింసలన్నిటిలోను, ఆయన నిరాశచెందలేదు సరికదా తన హృదయమును కృంగనీయలేదు (2 కొరింథీయులకు 4:1). ఆయన ఎదుర్కొనుచుండిన శ్రమల దృష్ట్యా పౌలు ఇచ్చుచున్న ఆభయము నుండి మనము ఎంతో ప్రోత్సాహము పొందవచ్చును: "మన యెడల ప్రత్యక్షము కాబోవు మహిమ యెదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నదగినవి కావని యెంచుచున్నాను" (రోమీయులకు 8:18). పునరుత్థాన సమయంలో మనము దేవుని పోలిక లోనికి (ఫిలిప్పీయులకు 3:21; 1 యోహాను 3:2) మార్పుపొందుదుమనునది మనకు వాగ్దానము చేయబడిన మహిమయై యున్నది (1 కొరింథీయులకు 15:51, 52). ఆ సమయంలో, మనము ఈ లోకములో జీవించుచుండినంత కాలము యేసును సేవించుటకు పడిన ప్రయాసములన్నియును ప్రయోజనకరమగు ఫలితములిచ్చాయని మనము తెలిసికొందుము. "మనము మేలుచేయుటయందు విసుకక యుందుము. మనము అలయక మేలు చేసితిమని తగిన కాలమందు పంటకోతుము" అని పౌలు వ్రాయుచున్నాడు (గలతీయులకు 6:9).

(2) *ప్రేమ వలని సన్నిహితము.* క్రైస్తవులముగా, మనము అధ్యాత్మికముగా అతి సన్నిహితులమై యుండవలెను. అనురాగసహితమైన సామాన్య బంధము మనలను ఒక్క గూటికి చేర్చును. క్రైస్తవుల సన్నిహితమును వర్ణించుచు పౌలు "అల్లిక" అను పదమును వాడుచున్నాడు. ఒక్కొక్క నూలుపోగు కలిసియుండునట్లు అల్లబడుట ద్వారా బట్ట ముక్క ఒక్కటైయున్న విధముగా, క్రైస్తవులు ప్రేమ చేత ఒక్కటిగా కలిసియుండవలెను. ఎవరికి వారే ఒక్కొక్కరుగా, మాటల్లో, చేతల్లో, ఆలోచనల్లో స్వతంత్రత కనుపర్చు వ్యక్తులముగా, దానంతట అదే ఊగులాడుచుండు నూలుపోగు వలె ఉండకూడదు, కానీ మనము క్రైస్తవ సహవాసమును అంబరముగా అల్లబడినవారమై యుండవలెను. వ్యక్తిగతముగా మెలగవలెనని వ్యవహరించు వ్యక్తులు విశాలమైన క్రైస్తవ కుటుంబములో ఒక భాగమగునట్లు వారికి సహాయము చేయు ఈ లక్షణము ప్రేమయై యున్నది.

క్రైస్తవ శీలము యొక్క శిఖరము ప్రేమయై యున్నది. ప్రేమ, మనకు ఆజ్ఞాపింపబడిన ఒక అంశమై యున్నది (యోహాను 13:34). అది సద్గుణములన్నింటిలోను అత్యంత గొప్పదైయున్నదని ప్రశంసింపబడినది (1 కొరింథీయులకు 13:13). దేవుడు ప్రేమయై యున్నాడు. మనము ఆయనను పోలినవారమై యుండునట్లు మనము ప్రేమించవలసినవారమై యున్నాము. మనము ఇతరులను ప్రేమించనట్లయితే, మనము దేవుని ఎరుగము, ఏలయనగా ఆయన ప్రేమయై యున్నాడు (1 యోహాను 4:8).

(3) *వివేకము విషయమై సంపూర్ణ అభయముతో కూడిన ఐశ్వర్యము.* వివేకము ద్వారా భౌతిక ఐశ్వర్యము కలుగునని పౌలు భావించలేదు. ఈ లోకము లోని అధిక సంఖ్యాకులు ఆశించునది ఇటువంటి ఐశ్వర్యమే. డబ్బు కోసం ప్రజలు వారి ఆత్మలను అమ్ముకొన్నారు, నానా విధములైన శోధనలకు ఎరయగుచున్నారు, అనవసరమైన అనేక ఉచ్చుల్లో చిక్కుకొనిపోతున్నారు, "అవివేకయుక్తములును హానికరములునైన అనేక దురాశలలో పడుచున్నారు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయుచున్నవి" (1 తిమోతి 6:9). ధనాపేక్ష మూలమున అసంఖ్యామైన ప్రజలు నాశమగుచున్నారు.

క్రైస్తవులముగా మనము కలిగియుండవలసిన ఐశ్వర్యము యేసు సమకూర్చు వివేకము వలన కలుగును, అసలుసిసలైన ఐశ్వర్యమేమైయున్నదో మోషే అర్థంచేసికొన్నాడు. ఆయన "ఐగుప్తు ధనము కంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొనెను; ... ఏలయనగా అతడు ప్రతిఫలముగా కలుగబోవు బహుమానమునందు దృష్టియుంచెను" (హెబ్రీయులకు 11:26). యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట వినయమునకు ప్రతిఫలము. "ఐశ్వర్యమును ఘనతయు జీవమును దానివలన కలుగును" అని సొలొమోను రచించాడు (సామెతలు 22:4).

సంపద గూర్చిన సమస్యలో నున్న అంతర్దృష్టిని సొలొమోను అర్థంచేసికొన్నాడు. గనుక ఆయన, "ద్రవ్యము నపేక్షించువాడు ద్రవ్యము చేత తృప్తినొందడు, ధనసమృద్ధి నపేక్షించువాడు దానిచేత తృప్తినొందడు; ఇదియు వ్యర్థమే" అని వ్రాసాడు (ప్రసంగి 5:10). జ్ఞానము మరియు గ్రహింపు యొక్క ఫలము "మేలిమి బంగారము కంటెను అపరంజికంటెను ఉత్తమమైనది, ప్రశస్తమైన వెండి కంటె నా వలన కలుగు వచ్చుబడి దొడ్డది" (సామెతలు 8:19). ధనమును అపేక్షించుచు దానినే వెదకువారిని ఆయన ఇలా మందలించాడు:

> ఐశ్వర్యము పొంద ప్రయాసపడకుము, నీకు అట్టి అభిప్రాయము కలిగినను దానివిడిచిపెట్టుము. నీవు దాని మీద దృష్టి నిలిపినతోడనే, అది లేకపోవును. నిశ్చయముగా అది రెక్కలు ధరించి ఎగిరిపోవును. పక్షిరాజు ఆకాశమునకు ఎగిరిపోవునట్లు అది ఎగిరిపోవును (సామెతలు 23:4).

పేదరికమునుగాని, ఐశ్వర్యమునైనను ఆశించకుండుట సంపద గూర్చిన సరైన కోరికయై యున్నది. ఈ రెండూ కూడా ఒకనిని దేవునినుండి దూరంచేయగలవు (సామెతలు 30:8, 9). దీనంతటికంటె, మనము క్రీస్తు ద్వారా కలుగు ఆధ్యాత్మిక ఐశ్వర్యమును మరియు సిరిసంపదల సమృద్ధిని కోరుకొనుట ఉత్తమము.

(4) *క్రీస్తు యేసునందలి బుద్ధి జ్ఞానములు.* దేవుని బుద్ధి జ్ఞానములు యేసు క్రీస్తు ద్వారా మాత్రమే బయలుపరచబడినవి. లోక జ్ఞానముచేత మనము దేవుని ఎరుగజాలమని పౌలు

ప్రాసాడు (1 కొరింథీయులకు 1:21). యేసును యేసు ఉపదేశములను అర్థంచేసికొనుట నిజమైన తెలివియై యున్నది. అపొస్తలుడైన పౌలు వలె, "బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు" లభించు యేసుక్రీస్తు నొద్దకు ప్రజలను నడిపింపవలెననునది మన అందోళన కూడా అయియున్నది.

(5) *యేసుక్రీస్తు యెడల విశ్వాసనీయత.* క్రీస్తునందుగల సర్వసంపదలనుబట్టి, మనము ఆయన యెడల విశ్వాసనీయమైనవారముగా నిలిచియుండి, మనుష్యుల మాయోపాయమైన మాటలతో చేయబడు ఉపదేశములు మరియు వారి తత్వమునకు మనము వశము కాకూడదు. కొలొస్సయులు మానవ జ్ఞానమందుకాక, క్రీస్తును చూచుటకు ప్రోత్సాహింపబడునట్టు సమస్త బుద్ధి జ్ఞానములు క్రీస్తునందు ఉన్నాయని పౌలు కొలొస్సయులకు చెప్పుటలో గల కారణమైయున్నది.

మనకు ఆధ్యాత్మిక రంగములో అవసరమైన సమస్తము యేసుక్రీస్తునందు లభించును. బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు క్రీస్తునందే లభించును. మనము ఆయనయందు కట్టబడుచు, ఆయననే స్థిరముగా హత్తుకొనియుంటూ, ఆయనను ఎడబాయకూడదు. మనము నిజముగా ఆయనలో ఒక భాగమైనట్లయితే, లౌకికమైన ఏ శక్తిగాని, బోధగాని మనము ఆయనతో కలిగియుండు సంబంధము నుండి మనలను వేరుచేయజాలవు.

**విశ్వాసమందు ఎదుగుచుండుట (2:1–5)**

యేసు క్రీస్తునందలి గొప్ప ఐశ్వర్యము అందరికి అందుబాటులో ఉన్నది. మనము ఆయనయందు బలపరచబడినవారమై, ఆయనతో కలిగియుండు సన్నిహిత సంబంధము నుండి పొందగల సమస్త మేళ్లను ఆనందంగా అనూభూతిచెందుచుండుట మన లక్ష్యమై యుండవలెను. యేసుక్రీస్తునందు లభించు ఆశీర్వాదములతో పోల్చిచూచుకొంటె, మనకిచ్చుటకు లోక నియమముల యొద్ద ఏమియులేదు.

పౌలు ఇతరులు సంక్షేమమును వెదికాడు (వచనాలు 1, 5). వారిని వ్యక్తిగత పరిపూర్ణత మరియు సిద్ధాంతపరమైన నిర్మలత్వము లోనికి తెచ్చుట ద్వారా సహోదరులను సంపూర్ణులనుగా చేసి యేసు యెదుట నిలువబెట్టుటకు ఆయన ఎంతో ప్రయాసపడ్డాడు.

యేసు క్రీస్తును అనుసరించువారు ఆధ్యాత్మికముగా పరిపూర్ణులై యుండవలెనని ప్రతి సంఘ నాయకుడు ఆశించుచుండవలెను. సంఘ సభ్యులందరును "దేవుని కుమారుని గూర్చిన జ్ఞానవిషయములోను, సంపూర్ణ పురుషులగువరకు, అనగా క్రీస్తునకు కలిగిన సంపూర్ణతకు సమానమైన సంపూర్ణత కలవారగువరకు" ప్రయాసపడవలెనని పౌలు ఎఫెస్సీ పత్రికలో, సంఘపెద్దలకు ఆదేశములు జారీచేసాడు (ఎఫెసీయులకు 4:13).

మగపిల్లలు సర్వసాధారణంగా ఎత్తుగా ఎదుగవలెనని కోరుకొనుచుందురు. కొన్నిపర్యాయములు వారు ఎదుగుచున్నారో లేదో, ఎంత ఎత్తునకు ఎదిగారో యని వారి తలిదండ్రుల ప్రక్కన నిలబడి వారి ఎత్తును కొలుచుకొనుచుందురు. వాడు ఎంతో ఎత్తుగా ఎదిగాడని ప్రదర్శించుటకు ఒక మగపిల్లవాడు తన తోబుట్టువైన పొట్టి తమ్ముడు లేక చెల్లెలు ప్రక్కన గర్వముతో నిలబడవచ్చును. మరొకడు తనకంటె ఎత్తుగా నున్న తన స్నేహితుని ఎత్తంత ఎదుగవలెనంటే వాడు యింకా ఎంత ఎక్కువ ఎదుగవలసి యున్నదో చూచుకొనునట్లు వాని స్నేహితుని ప్రక్కన నిలబడవచ్చును.

విశ్వాసులు వారితో నున్న గొప్ప సామర్థ్యముల గూర్చిన గొప్పలు చెప్పుకొనగలుగునట్లు వారు తమ్మునుతాము ఇతరులతో పోల్చుకొనకూడదని నాయకులు వారిని ప్రోత్సాహించవలెను. వారు తమ్మునుతాము యేసుతో పోల్చుకొనుచు కొలుచుకొనునట్లు ఈ నాయకులు సహోదరులకు శిక్షణ నీయవచ్చును. అప్పుడు సహోదరులు యేసు క్రీస్తు యొక్క సంపూర్ణతకు సరిపడు సమాన స్థాయికి ఎదుగగలరు.

క్రైస్తవులు ఎదుగునట్లు సహాయము చేయుటకు ఆయన తన ప్రాణమునైనను పానార్పణముగా పోయుటకు ఇష్టపడుచున్నాడని పౌలు తన వైఖరిని ప్రదర్శించాడు (ఫిలిప్పీయులకు 2:17). వారు సంఘ క్షేమాభివృద్ధి నిమిత్తము తమ్మునుతాము సమర్పించుకొనుటకు సహితము క్రైస్తవ నాయకులు ఇష్టపడుచుండవలెను.

పౌలు, దట్టంగా అల్లబడి అలుముకొనియున్న సన్నిహిత ప్రేమను మరియు ఆధ్యాత్మిక గ్రహింపును ఆశించాడు (వచనం 2). సహోదరులందరిని సన్నిహితముగా నిర్బంధించి యుంచునటువంటి ప్రేమను క్రైస్తవ సమాజములో అభివృద్ధి చేయవలెననునది ఆయన ప్రధాన లక్ష్యమై యుండెను. ప్రేమ "సోకుతుంది" మరియు నేర్పింపబడుతుంది. అపొస్తలులు యేసుతో కూడా సహసంబంధముతో మెలగుచుండుట ద్వారా వారు ప్రేమను ఆయన నుండి అబ్బజేసుకొన్నారు (యోహాను 13:34). పౌలు తన తోటి విశ్వాసులను మనఃపూర్వకంగా ప్రేమించాడు (1 కొరింథీయులకు 10:14; 15:58; 16:24; 2 కొరింథీయులకు 2:4). పౌలు యేసును వెంబడించుచుండగా, శిష్యులు పౌలును వెంబడించుట ద్వారా వారు ప్రేమ గూర్చి పౌలు నుండి నేర్చుకొనునట్లు వారికి ఒక తరుణముండినది (1 కొరంథీయులకు 11:1). తన స్నేహితుడైన దావీదు యెడల వాని కుండిన ప్రేమనుబట్టి యోనాతాను ఎంతటి త్యాగమునైనా చేయుటకు సంసిద్ధుడగుట, క్రైస్తవులు ఒకరి యెడల మరొకరు కలిగియుండవలసిన ప్రేమకు ఒక చక్కని ఉదాహరణమై యున్నది.

యేసు నుండి నేర్చుకొనుటలో ఎంతో సమయము గడుపవలసిన అవసరమున్నది. బుద్ధి జ్ఞానముల సర్వసంపదలకు ఆయన నిజమైన మూలమై యున్నాడు (వచనాలు 3, 4).

**యేసును మాత్రమే చూడుము (2:6, 7)**

క్రైస్తవులు యేసుక్రీస్తునందుండి మాత్రమే నడుచుకొనుచుండవలెను (వచనం 6), ఏలయనగా తండ్రి యొద్దకు మార్గము ఆయన మాత్రమే (యోహాను 14:6; అపొస్తలుల కార్యములు 4:12). ఆయనయందుండి నడుచుకొనుచుండుట అనగా, ఆయన చూపించిన జీవిత విధాన మాదిరిని అనుకరించుటయై యున్నది (1 యోహాను 2:6). మనము మన జీవితములను యేసు జీవిత విధానమునకు సరిపడునదై యుండునట్లు అంక్షలు విధించుకొనుట క్రైస్తవులముగా మన లక్ష్యమై యుండవలెను. లేదంటే మనము యేసునందుండి నడుచుకొనుచున్నావారము కాము.

మనము యేసునందు స్థిరముగా వేరుపారినవారమై యుండవలెను (వచనం 7). ఒక చెట్టు యొక్క వేర్లు బలమైనవి, నేలలో లోతుగాపారినవై యున్నప్పుడు, తుఫాను గాలులు ఎంత తీవ్రముగా వీచుచుండినను అది వాటికి తట్టుకొని స్థిరముగా నిలుబడగలదు. దేవుని వాక్యమును ధ్యానించుచుండువాడు నీటి కాలువల యోరను నాటబడినదై ఆకు వాడని చెట్టు వలె యుండునని దావీదు ఉద్బోధించాడు (కీర్తనలు 1:3). నీతిబోధలలో, సిద్ధాంతములలో,

లేదా మన జీవితంలోని ఏ కోణంలోనైనా యేసు నుండి వేరుచేయబడి తెంపబడలేనంతగా మనము ఆయనను అల్లుకొని అలుముకొని యుండవలెను (1 కొరింథీయులకు 15:58). సాతాను, లోకము ద్వారా, క్రైస్తవులు యేసుతో కలిగియున్న స్థిరమైన సంబంధము నుండి వారిని విడిదీసి వేరుచేయుటకు ఎడతెరిపిలేకుండా వెదకుచున్నాడు (1 పేతురు 5:8). యేసును వెంబడించుచున్నవారు లోకమునుగాని లోకములో ఉన్నవాటినిగాని ప్రేమించకూడదని యోహాను వారిని మందలించాడు (1 యోహాను 2:15-17).

---

సూచనలు

[1]ఫిలిప్పీయులకు 1:30; 1 థెస్సలొనీకయులకు 2:2; 1 తిమోతి 6:12; 2 తిమోతి 4:7; మరియు హెబ్రీయులకు 12:1లో ఇదే గ్రీకు పదము అగుపించును. [2]ఉదా॥ అపొస్తలుల కార్యములు 20:31; 2 కొరింథీయులకు 2:4; గలతీయులకు 4:19; ఫిలిప్పీయులకు 1:18; 1 థెస్సలొనీకయులకు 2:8 చూడుము. [3]"మరియు హియెరాపొలీలో నున్న వారు కూడ" అని కొన్ని చేతివ్రాత ప్రతులు చేర్చుచున్నవి. [4]1 సమూయేలు 16:7; 1 రాజులు 8:39; లూకా 16:15; అపొస్తలుల కార్యములు 1:24; రోమీయులకు 8:27; ప్రకటన 2:23. [5]Robert G. Bratcher and Eugene A. Nida, *A Translators Handbook on Paul's Letters to the Colossians and to Philemon*, Helps for Translators (New York: United Bible Societies, 1977), 46. [6]H. C. G. Moule, *The Epistles to the Colossians and to Philemon,* The Cambridge Bible for Schools and Colleges (Cambridge: University Press, 1893; reprint, 1902), 97. [7]Bratcher and Nida, 48. [8]1 కొరింథీయులకు 11:23; 15:1, 3; గలతీయులకు 1:9, 12; ఫిలిప్పీయులకు 4:9; 1 థెస్సలొనీకయులకు 2:13; 4:1; 2 థెస్సలొనీకయులకు 3:6 చూడుము. [9]A. T. Robertson, *Paul and the Intellectuals: The Epistle to the Colossians,* rev. and ed. W. C. Strickland (Nashville: Broadman Press, 1959), 76. [10]R. C. Lucas, *The Message of Colossians and Philemon: Fullness and Freedom,* The Bible Speaks Today (Downers Grove, Ill.: InterVarsity Press, 1980), 93.